జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP సంపుటి : 1 సంచిక: 95 శుక్రవారం 29 ఆగస్టు – 2025 పేజీలు : 8 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## విధులకు ఆలస్యంగా హాజరైతే ఉపేక్షించం



(సందేశం టైమ్స్): ఆలస్యంగా విధులకు హాజరైతే ఉపేక్షించబోమని వ్యవసాయశాఖ, అనుబంధ కార్పొరేషన్ల అధికారులు, ఉద్యోగులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టం చేశారు. ప్రతి రోజూ ఉదయం 10.30 గంటలకు కార్యాలయాలకు చేరుకోవాల్సిందేనన్నారు. గురువారం ఉదయం 10.40 గంటలకూ కొందరు ఉద్యోగులు విధులకు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో విధులకు హాజరు కాని సిబ్బంది నుంచి వివరణ తీసుకోవాలని ఆయా విభాగాల అధిపతులను ఆదేశించిన మంత్రి తుమ్మల.. ఆలస్యంగా హాజరయ్యే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో రైతులకు ఉద్యోగులు అందుబాటులో ఉండాలని, పంటనష్టం వివరాలను సేకరించి, అంచనాలను రూపొందించాలని ఆదేశించారు.

## బీసీలకు 42% రిజర్వేషన్లతో ఎన్నికలకు!

హైదరాబాద్, ఆగస్టు 28 (సందేశం టైమ్స్): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మంత్రుల కమిటీ గురువారం సమావేశమైంది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించింది. న్యాయనిపుణుల సలహాల అనంతరం రిజర్వేషన్లపై కమిటీ మూడు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను సీఎంకు సూచించినట్లు తెలిసింది. బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై గాంధీభవన్‌లో బుధవారం జరిగిన న్యాయ సలహా కమిటీ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీహరి, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. అభిషేక్ సింఘ్వీ తదితర న్యాయనిపుణులు ఇచ్చిన సలహాలు, సూచనలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై మహేశ్‌గౌడ్‌కు కమిటీ సభ్యులు మూడు ప్రత్యామ్నాయాలను సూచించినట్లు తెలిసింది. పార్టీ పరంగా ఎన్నికల్లో బీసీలకు 42 శాతం అవకాశం కల్పించడం, ప్రత్యేక జీవోతో రిజర్వేషన్లు అమలు చేయడం, మరో నెల రోజుల గడువు ఉన్నందున కేంద్రం నుంచి ఆమోదం లభించేవరకు నిరీక్షించడం.. ఈ అంశాలపై సీఎం రేవంత్‌తో చర్చించినట్లు తెలిసింది. సెప్టెంబరు 30లోపు స్థానిక సంస్థల



ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలన్న హైకోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్ల అమలుకు కార్యాచరణ రూపొందించడంపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. రిజర్వేషన్లు పెంచుతూ ప్రత్యేక జీవోతో ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తే అడ్డుకునేందుకు విపక్షాలు కోర్టును ఆశ్రయిస్తే ఏం చేయాలనేదానిపైనా చర్చించినట్లు తెలిసింది. గతంలో బీసీలకు సంబంధించిన సమాచారం లేకపోవడంతో రిజర్వేషన్ల పెంపును కోర్టు అంగీకరించలేదని, ఈ సారి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సమాచారాన్ని అందిస్తే కోర్టు సానుకూలంగా స్పందించే అవకాశం ఉంటుందని కమిటీ అభిప్రాయపడినట్లు సమాచారం. మరోవైపు హైకోర్టు గడువుపై సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశంపైనా సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. ఏదేమైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలకు వెళ్లడానికి సన్నాహాలు ప్రారంభించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా కమిటీకి స్పష్టం చేసినట్లు సమాచారం.

## బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి: హరీశ్



మెదక్, ఆగస్టు 28(సందేశం టైమ్స్): వర్షాలు, వరద ముంపు వల్ల నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. వర్షాల వల్ల విపత్కర పరిస్థితులు తలెత్తి ప్రజలు ఇబ్బంది పడుతుంటే మూసీ సుందరీకరణపై సీఎం సమీక్ష నిర్వహించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద ముంపు ప్రాంత ప్రజలను ఆదుకునే విషయంలో ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. మెదక్ జిల్లాలో వరద ముంపునకు గురైన హవేలీఘనపూర్ మండలంలోని పలు ప్రాంతాల్లో హరీశ్ పర్యటించారు. వరద బాధితులను పరామర్శించారు. వరదలో కొట్టుకుపోయి మృతిచెందిన సత్యనారాయణ, యాదాగౌడ్ కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ స్పోర్ట్స్ హబ్ తొలి సమావేశం – రాష్ట్రాన్ని క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 28 (సందేశం టైమ్స్): హైదరాబాద్‌లో గురువారం జరిగిన స్పోర్ట్స్ హబ్ ఆఫ్ తెలంగాణ పాలక మండలి తొలి సమావేశంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కీలక ప్రకటనలు చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడల ప్రోత్సాహం విషయంలో హైదరాబాదును ప్రధాన వేదికగా మార్చడమే తన లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు.

**ముఖ్యమంత్రి మాట్లాడుతూ**

తెలంగాణలో ఐటీ సంస్కృతిలా క్రీడా సంస్కృతి కూడా రావాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. గడిచిన ప్రభుత్వాలతో పోలిస్తే 16 రెట్లు ఎక్కువ క్రీడా బడ్జెట్ కేటాయించామని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు, ప్రభుత్వ ఉద్యోగాలు అందిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ (Young India Sports University)ని ఏర్పాటు చేశామని, ఇందులో ఫిజియోథెరపీతో పాటు క్రీడలకు సంబంధించిన కొత్త కోర్సులు ప్రవేశపెడతామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో స్టేడియాలు, ఆధునిక పరికరాలు ఉన్నా ఫలితాలు తక్కువగా ఉన్నాయన్నారు. అందువల్ల కోచ్‌లకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించాల్సిన అవసరముందని సూచించారు.

ఇప్పటి వరకు ఉన్న విధానాన్ని మార్చి %-% గ్రామ, మండల, నియోజకవర్గ, పార్లమెంట్ స్థాయిల్లో క్రీడా పోటీలు నిర్వహించి, రాష్ట్రస్థాయి జట్లను ఎంపిక చేసే విధానాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. క్రీడా సామగ్రిపై ఉన్న పన్నుల తగ్గింపుపై కేంద్రంతో చర్చిస్తామని, రాష్ట్రం తరపున తగిన ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

**స్పోర్ట్స్ హబ్ సమావేశంలో**

చైర్మన్ డాక్టర్ సంజీవ్ గోయెంకా,కో–చైర్ పర్సన్ ఉపాసన కొణిదెల,మాజీ క్రికెట్ కెప్టెన్ కపిల్ దేవ్,షూటర్ అభినవ్ బింద్రా,బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్,ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా,క్రీడా నిర్వాహకులు బియ్యాల పాపారావు, వీటా ధాని, రవికాంత్ రెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రానున్న మూడు సంవత్సరాల్లో సాధించాల్సిన లక్ష్యాలపై స్పోర్ట్స్ హబ్ బోర్డు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.సమావేశంలో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, ఎండీ సోని బాలదేవి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ క్రీడా రంగంలో అగ్రగామిగా నిలిపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని ఈ సమావేశం ద్వారా స్పష్టం అయ్యింది.

## నిజామాబాద్‌కు వెళ్లే 89 ఆర్టీసీ బస్సులు రద్దు

చాదర్‌ఘాట్, ఆగస్టు 28(సందేశం టైమ్స్): భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో హైదరాబాద్ మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుంచి కామారెడ్డి మీదుగా నిజామాబాద్‌కు వెళ్లే 89 ఆర్టీసీ బస్సులను రద్దు చేశారు. కామారెడ్డి మార్గంలో రోడ్లపై వరద ప్రవాహంతోపాటు పలు చోట్ల రోడ్లు కొట్టుకుపోయాయి. దాంతో ఈ రూట్లలో నడిచే ఆర్టీసీ బస్సులను తాత్కాలికంగా రద్దు చేశారు. అదేవిధంగా హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లే 9 ఆర్టీసీ బస్సులను కూడా రద్దు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

## కూలిపోయిన ఇళ్లు కట్టిస్తాం



హైదరాబాద్, ఆగస్టు 28 (సందేశం టైమ్స్): వర్షాల కారణంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కూలిపోయిన ఇళ్లను తిరిగి కట్టిస్తామని, నష్టపోయిన రైతులను ఆదుకుంటామని రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం విపత్తుల నిర్వహణ శాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న రహదారులను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామన్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కేవలం గంట వ్యవధిలో 700 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని, దీనివల్ల నీటివనరులు పూర్తిగా నిండిపోయి వరద నీరు ఉధృతంగా ప్రవహించిందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని వెల్లడించారు.సిరిసిల్ల జిల్లా నర్మల గ్రామం వద్ద బుధవారం మానేరు వరదల్లో చిక్కుకుపోయిన ఐదుగురిని హెలికాప్టర్ ద్వారా రక్షించినట్లు వివరించారు. భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాలకు అత్యవసర ఖర్చుల నిమిత్తం వారం క్రితమే ప్రభుత్వం జిల్లాకు రూ.కోటి విడుదల చేసిందన్నారు. భారీగా నష్టపోయిన జిల్లాలకు అదనపు నిధులు ఇస్తామని తెలిపారు.

## నష్టం లెక్కలు వేయండి..

మెదక్ అర్బన్, హైదరాబాద్, పెద్దపల్లి, ఆగస్టు 28(సందేశం టైమ్స్): భారీ వర్షాల కారణంగా కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో జరిగిన పంట, ఆస్తి నష్టాలపై నివేదికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. హైదరాబాద్ నుంచి బయల్దేరిన ఆయన ఎల్లంపల్లి ప్రాజెక్టును, కామారెడ్డి వరద ప్రాంతాలను సందర్శించిన అనంతరం కామారెడ్డిలో జిల్లా వరద సమీక్ష నిర్వహించాలని ప్లాన్ చేశారు. వాతావరణం అనుకూలించక పోవడంతో కామారెడ్డి ఏరియల్ సర్వే ముగించుకొని మెదక్ జిల్లాకు వచ్చారు. మెదక్ వరద ప్రాంతాలను సందర్శించిన అనంతరం మెదక్ ఎస్పీ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.

# ఉపాధ్యాయుల కీలక పాత్ర సమాజ నిర్మాణంలో

## – జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్






(సందేశం టైమ్స్) : సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. విద్యార్థులు దారి తప్పకుండా క్రమశిక్షణతో చదువుకునేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఆయన పేర్కొన్నారు.గురువారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయంలో ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ – ప్రతి పాఠశాలలో సోమ, మంగళవారాల్లో తప్పనిసరిగా ఉపాధ్యాయుల హాజరు 100% ఉండాలని, మిగిలిన రోజుల్లో కూడా హాజరు శాతం పెంచాలని ఆదేశించారు.విద్యార్థుల హాజరు పెంపు కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని సూచించారు.సెప్టెంబర్ 1 నుండి 9వ, 10వ తరగతి విద్యార్థులకు అదనపు క్లాసులు, 6,7,8 తరగతుల వారికి “ప్రగతి గ్రూప్స్” పేరిట క్లాసులు నిర్వహించాలని తెలిపారు.ప్రతి విద్యార్థి నెలలో పది రోజులు తెలుగు పఠనం, పది రోజులు రాతాభ్యాసం, పది రోజులు ప్రాథమిక గణితం సాధన చేయాలని, ప్రతిభ చూపిన వారికి బహుమతులు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కోసం ప్రతి కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ కు రూ.3,000 మంజూరు చేశారు.అలాగే –కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు నెలలో కనీసం 15 పాఠశాలలు తనిఖీ చేయాలని, ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ, అదనపు తరగతులు తదితర అంశాలపై సమీక్ష చేయాలని సూచించారు.9,10 తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి, గరిష్టంగా 90%, కనిష్టంగా 70% మార్కులు సాధించేలా కృషి చేయాలని తెలిపారు.పాఠశాలలకు అవసరమైన నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు కొరత ఉంటే తెలియజేయాలని, రెండో జత యూనిఫార్ములు కుట్టి పూర్తి చేసిన వెంటనే పంపిణీ చేయాలని ఆదేశించారు.ఐఎఫ్‌పి ప్యానెల్ ద్వారా బోధన మంచి ఫలితాలు ఇస్తోందని పేర్కొంటూ, విద్యార్థులకు ఇంగ్లీష్ కీలక పదాలు ముందుగా నేర్పించాలని సూచించారు.శిథిలావస్థలో ఉన్న భవనాలను ఖాళీ చేసి వేరే భవనాల్లో తరగతులు నిర్వహించాలని, టాయిలెట్స్ అవసరమైతే ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తామని హామీ ఇచ్చారు.ఎకో క్లబ్‌లలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, కోఆర్డినేటర్లు జనార్ధన్, శ్రావణ్ కుమార్, రాంబాబు, పూలమ్మ, ఎంఈవోలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పర్యటన

## ఇంచార్జి మంత్రి సీతక్క





సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 28ఆగస్టు: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వం సలహాదారులు సబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ గారు కామారెడ్డి జిల్లాలోని పలు గ్రామాల్లో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావాన్ని పరిశీలించారు. ఈ వర్షాల వలన రోడ్లు, వంతెనలు దెబ్బతినడంతో పాటు పంట పొలాలు కొట్టుకుపోయాయి. నిరంతర వర్షాల మధ్య వారు పర్యటించి, ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈరోజు సాయంత్రం కామారెడ్డి జిల్లా కలెక్టర్ తో సీఎం రివ్యూ తీసుకుంటారు అన్నారు

# భారీ వర్షాల కారణంగా ప్రమాదానికి గురైన వాగులను రోడ్డులను మరియు బ్రిడ్జిలను అధికారులతో కలిసి పరిశీలించిన శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి







సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 28ఆగస్టు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం: శంకరంపేట మండల పరిధిలోని గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రమాదానికి గురైన శివాయిపల్లి బ్రిడ్జి,మరియు దానంపల్లి బ్రిడ్జి, జీడి వాగు వంతెన, జమున నాయక్ తండ కల్వటు, ఉత్తులూరు గ్రామ వంతెన భారీ వర్షాల కారణంగా ప్రమాదానికి గురైన విషయం తెలుసుకొని వెంటనే ప్రమాదానికి గురైన స్థలానికి వెళ్లి వాటిని పరిశీలించి వెంటనే తాత్కాలిక మరమ్మత్తులను చేయాలని ప్రజలకు రవాణా సౌకర్యం లో ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించిన నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ

అకాల వర్షాల కారణంగా వాగులు పొంగి పొర్లడం, చెరువు కట్టలు దెబ్బ తినడం రహదారులు కృంగిపోవడం కలవట్లు కూలిపోవడం వంటి పరిస్థితులు ఏర్పడ్డాయి విద్యుత్ అంతరాయం రాకపోకలలో చోటు చేసుకుంటున్నాయని వాతావరణ శాఖ అంచనా ప్రకారం రానున్న రెండు నుండి మూడు రోజుల పాటు వర్షాలు బావ పరిస్థితులు కొనసాగుతున్నాయని కాబట్టి ప్రజలందరూ దీనిని గమనించి అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాను విద్యుత్ అంతరాయం వచ్చినప్పుడు ఎట్టి పరిస్థితులను స్వయంగా మరమ్మత్తులు చేయవద్దు వెంటనే మీ గ్రామంలోని ఎలక్ట్రిషన్ లేదా సబ్ స్టేషన్ సిబ్బందిని సంప్రదించండి అత్యవసర పరిస్థితులు తప్ప మరెక్కడికి ప్రయాణం చేయకండి రహదారులు అనేక చోట్ల కృంగిపోవడం అలవాట్లు కూలిపోవడం వంటి ప్రమాదాలు తలెత్తి అవకాశం ఉంది బయటకు వెళ్లేవారు ముందుగానే మార్గస్థితి గురించి తెలుసుకొని జాగ్రత్తలు తీసుకోవాలి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే సూచించారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటు నారా గౌడ్ మండల కాంగ్రెస్ నాయకులు, సాయి రెడ్డి మాజీ ఎంపీటీసీ, అంజిరెడ్డి మాజీ సర్పంచ్, పెరుమాళ్ గౌడ్,రాజు మాజీ ఎంపీటీసీ,మండల ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు

# విఘ్నేశ్వరుడి కృపతో ప్రజలంతా సంతోషంగా ఉండాలి :

## నీలం మధు ముదిరాజ్..



సందేశం టైమ్స్ సంగారెడ్డి టౌన్ ప్రతినిధి: బుధవారం వినాయక చవితి పండుగ సందర్భంగా తన స్వగ్రామం చిట్కుల్ లోని తన ఇంటి పరిసరాలలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి పూజలో పాల్గొని ఆ ఘననాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్. ఈ సంధర్భంగా ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలంతా సకల విఘ్నాలు తొలిగి సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

# మెదక్ జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటన

## వరద బాధితులతో మాట్లాడిన మంత్రి



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 28ఆగస్టు: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ నరసింహ మెదక్ జిల్లాలోని రామాయంపేట లో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన. వరద బాధితులతో మాట్లాడారు . లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సహాయక చర్యలను చేపట్టాలని ఆదేశించారు . గత రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అతి భారీ వర్షాల వల్ల రామాయంపేట జలదిగ్బంధంలో చిక్కుకుందన్నారు . గత రెండు రోజుల నుండి భారీ వర్షాలలో చిక్కుకున్న 60 మందిని జిల్లా డిజాస్టర్ యంత్రాంగం ,రెవిన్యూ , పోలీసులు , వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కాపాడారన్నారు . ఇద్దరూ వ్యక్తులు గల్లంతయ్యారన్నారు . వరదల్లో కొట్టుకుపోయిన ఒకరి మృతదేహం లభించిందని మంత్రి వెల్లడించారు . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. ప్రభుత్వం పూర్తి అప్రమత్తతో ఉందన్నారు . జిల్లా కు చెందిన ప్రభుత్వ యంత్రాంగం ప్రజలను కాపాడే పనిలో నిమగ్నమై ఉన్నారన్నారు. వరద ప్రాంతాల్లో, లోతట్టు ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలపై జిల్లా కలెక్టర్, ఎస్పీ లతో మంత్రి టెలిఫోన్లో సమీక్షించారు. గత 50 ఏళ్ల లో ఇంతటి భారీ వర్షాలను చూడలేదని స్థానిక ప్రజలు మంత్రికి తెలిపారు. మెదక్ జిల్లాలోని రామాయంపేట లోని కామారెడ్డి రోడ్ లో ఉన్న బీసీ కాలనీ నీటి మునిగిన ఇండ్లను వరదని ఉద్రిత్తిని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పరిశీలించారు. రామాయంపేటలోని వరద ప్రభావిత ప్రాంతాలను లోతట్టు ప్రాంతాలను మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు గారితో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారికి నిత్యవసర వస్తువులను భోజనాలను బట్టలను బెడ్ షీట్లను అందజేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. నిజాం పేట మల్క చెరువు , కోనాపూర్ , నందిగామ రోడ్డు లో దెబ్బ తిన్న బ్రిడ్జి , సాయి చెరువు అలుగు లను క్షేత్ర స్థాయిలో మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. వచ్చే రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాలలోని ప్రజలు రెవిన్యూ ,పోలీస్ ,డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బందికి

# వరద భదితులకు సేవాభారతి కార్యకర్తల సహాయం

సందేశం టైమ్స్:సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి అగస్టు 28: ఈరోజు కామారెడ్డి లో వరద బీభత్సావం సృష్టించడం జరిగిన విషయం మనందరికీ తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నీట మునిగిన జి ఆర్ కాలనీలో ప్రజలను తరలించడానికి %చీణ=ఖీ% బృందానికి సేవాభారతి కార్యకర్తలు సహకరించి ఎనిమిది మందిని ఆ వరదల్లో చిక్కుకున్న ఇండ్ల నుంచి బయటికి తీసుకురావడం జరిగింది. అలాగే సుమారుగా 7, 8 గంటల పాటు ట్రాఫిక్ ఇబ్బందుల వల్ల నేషనల్ హైవే మీద చిక్కుకున్నటువంటి సుమారు 600 నుంచి 700 మందికి అరటి పళ్ళను, మంచినీళ్లను, బిస్కెట్ ప్యాకెట్లను అందించడం జరిగింది. అలాగే పులిహోర ప్యాకెట్లను కూడా అందించడం జరిగింది. బతుకమ్మ కుంట అయ్యప్ప కాలనీలో పరిస్థితులను అంచనా వేసి తదుపరి సేవా కార్యక్రమాలకోసం ఈ రోజు కూడా ఆ ప్రదేశాలకు కార్యకర్తలు వెళ్ళడం జరిగింది.



# రాష్ట్రంలో వరదలపై సీఎం రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే




హైదరాబాద్ (సందేశం టైమ్స్) : రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల ప్రభావంపై ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు శుక్రవారం ఉదయం ఉన్నతస్థాయి సమీక్ష అనంతరం హెలికాప్టర్‌లో వరద ప్రాంతాలపై ఏరియల్ సర్వే చేపట్టారు. ముఖ్యమంత్రి గారు నీటి పారుదల శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌లతో కలిసి తొలుత ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలించి, వరద పరిస్థితిపై అధికారుల నుంచి నివేదికలు అందుకున్నారు. అనంతరం పోచారం ప్రాజెక్టు, కామారెడ్డి జిల్లా పరివాహక ప్రాంతాలను కూడా పరిశీలించారు. అయితే వాతావరణం అనుకూలించకపోవడంతో ముఖ్యమంత్రి హెలికాప్టర్ కామారెడ్డిలో ల్యాండ్ కాలేకపోయింది. దాంతో నేరుగా మెదక్ జిల్లాకు చేరుకున్న సీఎం గారు జిల్లా ఎస్పీ కార్యాలయంలో లోక్‌సభ సభ్యుడు రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వరద నష్టంపై సమగ్ర నివేదికలు తయారు చేసి సమర్పించాలని ఆదేశించారు. సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక కామారెడ్డి జిల్లాలో వరదల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను మంత్రి అనసూయ సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పరిశీలించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీతో కలిసి పరిస్థితిని సమీక్షించి, సహాయక చర్యలపై మార్గదర్శకాలు జారీ చేశారు.

## హైదరాబాద్ భవిష్యత్తు దృష్ట్యా

# మూసీ నది అభివృద్ధి ప్రణాళికపై సీఎం సమీక్ష



(సందేశం టైమ్స్): హైదరాబాద్ నగరం వచ్చే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మూసీ నదీ పరివాహక ప్రాంత అభివృద్ధి జరగాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన ఈ అంశంపై సమీక్ష నిర్వహించారు.

**సమావేశంలో ముఖ్యమంత్రి గారు**

గేట్ వే ఆఫ్ హైదరాబాద్, గాంధీ సరోవర్ అభివృద్ధి, సిగ్నల్ రహిత జంక్షన్లు, రోడ్ల విస్తరణ వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. గాంధీ సరోవర్ అభివృద్ధికి సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించిన సీఎం, అభివృద్ధి పనులు పర్యావరణ హితంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, మీరాలం చెరువు అభివృద్ధి, ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణంపై అధికారులు సమగ్ర ప్రణాళికలను వివరించారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్ ను వెంటనే సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో సీఎం సలహాదారు వేంనరేందర్ రెడ్డి, పరిశ్రమలు, మున్సిపల్ మరియు పట్టణాభివృద్ధి శాఖ, హెచ్ఎండీఏ , హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ఎస్‌బీ , ఎంఆర్‌డీసీఎల్ ఉన్నతాధికారులు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తదితర అధికారులు పాల్గొన్నారు

# సంగారెడ్డి జిల్లా జిల్లాలో కురిసినభారీ వర్షాల పట్ల

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## - జిల్లా కలెక్టర్ పి .ప్రావీణ్య .

సందేశం టైమ్స్:సంగారెడ్డి టౌన్ ప్రతినిధి 28ఆగస్టు: జిల్లాలో కురిసిన వర్షాలపట్ల అన్ని శాఖలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి .ప్రావీణ్య అధికారులకు ఆదేశించారు . గురువారం సంగారెడ్డి పట్టణ పరిధిలోని రేణిగుంట ఎర్రగుంట, మాసాను కుంట చెరువులు వరదనీటితో పొంగిపొర్లుతున్న నేపథ్యంలో కలెక్టర్ స్వయంగా పర్యటించారు. రేణిగుంట చెరువులో ఏర్పడిన గండిని పరిశీలించిన కలెక్టర్ తక్షణ మరమ్మత్తులు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. చెరువు కట్టలు తెగిపోకుండా చర్యలు తీసుకోవాలని, నీరు సవ్యంగా కిందికి పారేలా మార్గాలు కల్పించాలని సూచించారు.

ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ – వాగులు, చెరువులు, కుంటల వద్దకు ప్రజలు వెళ్లకుండా ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని, రెవెన్యూ, పోలీస్, నీటి పారుదలశాఖ , మున్సిపల్ శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన బందోబస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టంచేశారు. జిల్లాలో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నంబర్ 08455 – 276155 ఏర్పాటు చేయబడిందని కలెక్టర్ తెలిపారు. కొనసాగుతున్న వర్షాల దృష్ట్యా, సంబంధిత అన్ని విభాగాలు, తక్షణ చర్యలు తీసుకోవాలని కార్యకలాపాలను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని చెరువులు, వాగులు భారీ వర్షాల కారణంగా పొంగిపొర్లే పరిస్థితి నెలకొంది, ప్రతి చెరువు కట్టవద్ద ఇంజనీర్లు, క్షేత్ర అధికారులు తనిఖీ చేయాలి. చెరువుల సమీప గ్రామాలకు ముందస్తు హెచ్చరికలు ఇవ్వాలి. చెరువుల కట్టలు,వాగులవద్ద ఇంజనీర్లు తనిఖీలు నిర్వహించి భద్రత



చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు . ఇంటింటికీ తిరిగి ఇంటెన్సివ్ జ్వర సర్వేలు నిర్వహించి, సత్వర చికిత్సఅందించాలని , ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సామాజిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని ముఖ్యమైన మందులు అందుబాటులో ఉండేలాచూసుకోవాలని అన్నారు. తండాలలో గర్భిణీ స్త్రీలు (EDD - Expected Date of Delivery) నిశితంగా పర్యవేక్షణలో ఉండాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. %ూచీవీ%లు, ఆశా వర్కర్లు రోజువారీగా తండాలను సందర్శించి, గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిస్థితుల నివేదికలను సమర్పించాలని తెలిపారు . తాండా లలో గర్భిణీ స్త్రీలు ఎటువంటి ప్రమాద పరిస్థితిని ఎదుర్కోకుండా ముందస్తు వైద్య చర్యలు చేపట్టాలని ప్రతి కేసును నిశితంగా పర్యవేక్షించి, తల్లీబిడ్డల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను అన్నారు .మునిసిపాలిటీలు %డ% గ్రామ పంచాయతీ ప్రాంతాలలో వర్షపు నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించే చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. దోమల పెరుగుదలను అరికట్టేందుకు ఆయిల్ బాల్స్ వదలడం, దోమల మందు పిచికారి నిర్వహించడం తప్పనిసరి అని ఆదేశించారు. అన్ని లోతట్టు ప్రాంతాలు , మురుగు కాలువలను వెంటనే శుభ్రం చేయాలని తెలిపారు . వాహకాల ద్వారా సంక్రమించే వ్యాధులను నివారించడానికి పారిశుద్ధ్య చర్యలను బలోపేతం చేయాలన్నారు . పట్టణ ,గ్రామీణ ప్రాంతాలలో ముఖ్యమైన రహదారులు, జంక్షన్లలో గుంతలను వెంటనే పూడ్చే చర్యలు చేపట్టాలి. త్రాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులకు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి గ్రామంలో రోజువారీగా నీటి నమూనాలు సేకరించి ల్యాబ్ పరీక్షలు చేయాలి. ప్రతీ గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలో నీటి నిల్వ ట్యాంకులను క్లోరినేట్ చేసి శుద్ధి చేయాలి. మురికినీరు లేదా మట్టికణాలు కలిసిన త్రాగునీటిని శుద్ధి చేయడానికి అలమ్, క్లోరిన్ వాడకం తప్పనిసరని సూచించారు . ప్రధాన జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, గ్రామీణ రహదారులన్నీ క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు .వాహన రాకపోకలకు ఆటంకం కలుగకుండా, రహదారుల భద్రత, మరమ్మత్తుల తక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు . వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడం, గుంతలు ఏర్పడటం, వాహన రాకపోకలకు ఆటంకం కలుగకుండా తక్షణ తనిఖీలు నిర్వహించి కలగడం సహజం. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని తెలిపారు . రోడ్లలో గుంతలు ఉన్న చోట తాత్కాలిక మరమ్మత్తులు 48 గంటల్లోపు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ రవీందర్ రెడ్డి , సంగారెడ్డి తహసీల్దార్ జయరామ్ , మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి , సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు .

# బషీర్ బాగ్ నెత్తుటి మరకకు 25 ఏళ్లు!



28 ఆగస్టు (సందేశం టైమ్స్) 2000 %-% తెలంగాణ చరిత్రలో మరపురాని నల్లరోజు. అప్పటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిన నేపథ్యంలో, ప్రజలు ఆగ్రహంతో బషీర్ బాగ్ చౌరస్తాలో నిరసనకు దిగారు. విద్యార్థులు, కార్మికులు, సాధారణ ప్రజలు కలిసి శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో అమాయకుల ప్రాణాలు బలయ్యాయి. ఆ రోజు బషీర్ బాగ్ రక్తంతో తడిసి ముద్దయింది. ఈ ఘటన ఒక్క తెలంగాణలోనే కాదు, రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ రాజకీయాలపై లోతైన ముద్ర వేసింది. విద్యుత్ చార్జీలు తగ్గించమని అడిగితే బుల్లెట్లతో సమాధానం ఇచ్చిన ఘటన ప్రజల మనసుల్లో ఆగ్రహాన్ని రగిలించింది. ఈ సంఘటన తర్వాతే తెలంగాణ ఉద్యమానికి మరింత బలం చేకూరింది. బషీర్ బాగ్ సంఘటనతో కలిగిన దుఃఖం, ఆవేదనలోనే కేసీఆర్ అప్పట్లో టీడీపీకి రాజీనామా చేసి, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమం బాట పట్టారు. ఈ నిర్ణయం తరువాతి దశలో లక్షలాది మంది ప్రజలను కదిలించి, తెలంగాణ ఆవిర్భావానికి దారి తీసింది. నేడు, 25 ఏళ్ల తర్వాత కూడా, బషీర్ బాగ్ రక్తపాతం జ్ఞాపకం తెలంగాణ ప్రజల మనసుల్లో నెత్తుటి మరకలా నిలిచిపోయింది. ఆ రోజు చనిపోయిన వారి త్యాగమే తెలంగాణ రాష్ట్ర సాధనకు దారితీసిందని చరిత్ర చెబుతోంది. బషీర్ బాగ్ కాల్పులు కేవలం విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన మాత్రమే కాదు, అది తెలంగాణ ఉద్యమానికి కొత్త దిశ చూపిన మలుపు, తెలంగాణ ఆవిర్భావానికి పునాది వేసిన సంఘటన.

## గణేశ్ నిమజ్జనాల సందర్భంగా..

# నేటి నుంచి సెప్టెంబర్ 5 వరకు ట్రాఫిక్ ఆంక్షలు



హైదరాబాద్ సిటీ:(సందేశం టైమ్స్) నగరంలో పలు ప్రాంతాల నుంచి వచ్చే వరుస గణనాథుల నిమజ్జనాలను పురస్కరించుకొని ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని జాయింట్ సీపీ జోయల్ డేవిస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా రోజుల్లో నిమజ్జనానికి వచ్చే విగ్రహాలను బట్టి ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా పీవీఎన్ఆర్ మార్గ్‌లలో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయన్నారు

# విద్యుత్ షాక్ తో యువకుడు మృతి



## ఇద్దరు పరిస్థితి విషమం

## ముగ్గురికి స్వల్ప గాయాలు

యు.కొత్తపల్లి ఆగస్టు 28(సందేశం టైమ్స్): మూలపేట గ్రామంలో ఆరుగురు యువకులకు విద్యుత్ షాక్కు గురు కావడంతో ఏడిద చరణ్(19) మృతి చెందగా వల్లూరి నగేష్(27), మడికి నిఖిల్ (18) పరిస్థితి విషమంగా ఉండగా విష్ణు, రాజు, తేజ స్వల్ప గాయాలతో బయట పడినట్లు స్థానికులు తెలిపారు వారు తెలిపిన వివరాలు ప్రకారం ఉదయం వాలీబాల్ ఆడుకునేందుకు స్తంభాలు నిలబడుతున్న తరుణంలో పక్కనే ఉన్న విద్యుత్ తీగల కు తగలడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. గాయాలు పాలైన యువకులను తొలిత పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న కొత్తపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు విద్యుత్ షాకు తో మృతి చెందిన ఏడిద చరణ్, గాయాల పాలైన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నేరుగా విలపించడంతో మూలపేట గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# వీధి కుక్కల దాడిలో ఏడు గొర్రెలు మృతి



వంగర (విజయనగరం) ఆగస్టు 28(సందేశం టైమ్స్): : వీధి కుక్కల దాడిలో ఏడు గొర్రెల మృతి చెందిన ఘటన మండలంలోని తలగాంలో జరిగింది. గ్రామానికి చెందిన పడాల.రాము తన కళ్ళములో గొర్రెలను ఉంచి తన పనిపై ఇంటికి వెళ్లారు. ఇంతలో వీధి కుక్కలు మూకమ్మడిగా వచ్చి దాడి చేయడంతో ఏడు గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల యజమాని పడాల రాము కన్నీటి పర్యంతమయ్యారు. సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

# తప్పుడు సమాచారం ఇద్దరు గిరిజన యువకులపై పోలీసుల దాడి



పెదబయలు (అల్లూరి) ఆగస్టు 28(సందేశం టైమ్స్): అల్లూరి జిల్లా పెదబయలు మండలం బండపల్లి పంచాయతీకి చెందిన సంపంగి పుట్టు గ్రామానికి చెందిన పాంగి రాజరావు (30), కొర్ర కామేశ్వరరావు (35) అను గిరిజన యువకులు వరి అవసరాల నిమితమై జోలపుట్టుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బంగారుమెట్ట పంచాయతీ పరిధి కుజబంగి బంగారుమెట్ట మార్గమధ్యలో భోజనం కోసం మెయిన్ రోడ్డు పక్కన కూర్చున్నారు. తప్పుడు సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ కొల్లి రమణ సిబ్బందితో కలిసి వీరిపై అమానుషంగా దాడి చేసి గాయపరిచారని బాధితుల తరుపున అల్లూరి జిల్లా ఎస్పి రాష్ట్ర హెూం మినిస్టర్కు ఫిర్యాదు చేయనున్నట్లు మాజీ ఎంపీపీ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు వి.కొండయ్య, పార్టీ కార్యదర్శి కొర్ర రాజరావు లు మీడియాకు తెలిపారు. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన తెలుగుదేశం పార్టీ మండల నాయకులకు తెలియడంతో బాధితులకు ప్రధమ చికిత్స అందించారు. ఇద్దరిలో ఒకరికి తలపై, ఎడమ కాలు తొడపై మరొకరికి మెడపై పోలీసులు బలమైన గాయాలు చేశారు. దీంతో ఆ ఇద్దరూ నడవడానికి వీలు కాని పరిస్థితి నెలకొంది. బాధితులకు న్యాయం జరిగేలా ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ విషయం పై స్థానిక ఎస్ఐ కొల్లి రమణ ను వివరణ కోరగా తాను కానీ సిబ్బంది కానీ ఎవరినీ గాయపరచలేదని అన్నారు.

# విద్యుద్ఘాతంతో రెండు ఎద్దులు మృతి



కౌతాళం :ఆగస్టు 28(సందేశం టైమ్స్): మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో విద్యుత్ శాఖ గురై రెండు ఎదులు మృతి చెందగా ఒక వ్యక్తికి గాయలైన సంఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉరుకుంద గ్రామం నుండి ఎద్దుల బండిలో ఐరన్ డబ్బాను తిమ్మాపురం గ్రామానికి తరలిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి ఈ ఘటన జరిగింది. తిమ్మాపురం గ్రామానికి చెందిన ఆంజనేయ రైతుకు చెందిన రెండు లక్షల రూపాయలు విలువ చేసే రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందగా సోదరుడు రమేష్(28) విద్యుత్ గురికావడంతో గాయాలు అయ్యాయి. ముగ్గురు తృటిలో తప్పించుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని గ్రామస్తులు మహదేవ ఈరన్న తదితరులు పేర్కొన్నారు. విద్యుత్ తీగల విషయంలో గతంలో ఎన్ని సార్లు ఆ శాఖ అధికారులకు దృష్టికి తీసుకెడిన నిర్లక్ష్యంగా ఉండడంతో ఇలాంటి సంఘటన ఎప్పుడు చేసుకున్నారు.

# శునకానికి శ్రీమంతం



రామచంద్రాపురంఆగస్టు 28(సందేశం టైమ్స్): మండలంలోని అనుపల్లి పంచాయతీ బొప్పరాజు పల్లి గ్రామానికి చెందిన కుమ్మర నాదముని, సుబ్రహ్మణ్యంలు తన పెంపుడు కుక్కకు (శునకానికి) శ్రీమంతం చేసి ప్రేమను చాటుకున్నారు. బొప్పరాజు పల్లి సమీపంలోని ఫామ్ హౌస్ నందు సాయంత్రం శ్రీమంతాని వైభవంగా నిర్వహించారు. జంతు ప్రేమికులుగా తమ పెంపుడు జంతువైన ఆడ శునకం గర్భం దాల్చడంతో నూతన వస్త్రాలు, పసుపు కుంకుమ, వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించి శ్రీమంతం నిర్వహించారు. తన ఇంటిలోని పెంపుడు జంతువైన శునకాన్ని గౌరీ దేవిగా భావించి, జంతువులపై ఉన్న ప్రేమతో శ్రీమంతం నిర్వహించామని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి మాంసాహారం తో కూడిన విందు భోజనాలు ఏర్పాటు చేశారు. శునకానికి శ్రీమంతం చేసిన సంఘటన అందరిని ఆకట్టుకుంది. ప్రేక్షకులందరూ జంతు ప్రేమికులైన కుమ్మర సుబ్రహ్మణ్యం, నాదమునిలను అభినందించారు. ఐదు మంది ముత్తైదువులకు పసుపు, కుంకుమ, గాజులు, బొందారం, చీర, రవికలతో పాటు పూలు, స్వీట్లు అందజేశారు. ప్రేక్షకులందరూ గర్భం దాల్చిన శునకానికి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ మూగజీవుల పట్ల ప్రేమ చూపాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఎస్ఐ సార్.. మా ఊరి బస్సు రాలేదు

## ఎస్ఐ దిలీప్ కుమార్‌తో మాట్లాడుతున్న విద్యార్థులు

## హెుళగుదం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ముద్దటమాగి విద్యార్థులు



హెుళగుంద, ఆగస్టు 28(సందేశం టైమ్స్): మండలంలోని ముద్దటమాగి గ్రామానికి చెందిన 50 మంది విద్యార్థులు తమ ఊరి బస్సు రాలేదని హెుళగుంద పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. తాము హెుళగుంద జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్నామని, రోజూ బస్సులోనే వెళతామన్నారు. కాగా ఈరోజు బస్సు రాలేదని ఎస్ఐ గురజాల దిలీప్ కుమార్‌కు సమస్యను తెలిపారు. స్పందించిన ఎస్ఐ ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేయగా అరగంటలో వస్తుందని చెప్పగా సాయంత్రం 7గంటల వరకు వేచి చూసినా, రాకపోవడంతో పోలీస్ వాహనంలో విద్యార్థులను వారి గ్రామానికి పంపించారు. దీంతో ఎస్ఐని గ్రామస్థులు అభినందించారు. ఈ విషయంపై డీఎం మహమ్మద్ రఫీని సంప్రదించగా సరైన సమాధానం ఇవ్వలేదు.

# ఉండాల్సింది 25 మంది.. ఉన్నది ఆరుగురు




విజయపురిసౌత్ ఆగస్టు 28(సందేశం టైమ్స్): ప్రభుత్వ మేనేజ్ మెంటకు సంబంధించిన విజయపురిసౌత్, గురజాల, వినుకొండ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత, ప్రత్యేకించి సబ్జెక్టు టీచర్లు లేని కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మూడు పాఠశాలల్లోని కొంతమంది విద్యార్థులైతే ప్రైవేటు పాఠశాలల్లో చేరుతున్నారు. ప్రమోషన్ జాబితాలో ఈ మూడు పాఠశాలలకు ఉపాధ్యాయులు రావడం లేదు. ప్రభుత్వం మేనేజ్‌మెంట్‌లో ఇవ్వడానికి సరిపడా డీఎస్సీద్వారా కూడా మరలా ప్రమోషన్ ఎస్‌జిటిలు కూడా లేరు. ప్రస్తుత అన్ని ఖాళీ పోస్టులు చూపించక పోవడంతో విద్యార్థులు ఉపాధ్యాయులు లేకతీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. పల్నాడు ప్రాంతాలో చదివే పిల్లలు ఎక్కువగా పేద మరియు వెనుకబడిన వర్గాలకు చెందినవారు. వీరి భవిష్యత్తు మెరుగుపడాలంటే ప్రస్తుత డీఎస్సీలో అన్ని ఖాళీ పోస్టులను భర్తీ చేయవలసి ఉంది. ముఖ్యంగా విజయపురిసౌత్ మారుమూల గ్రామమైనందున ఇక్కడకు ఉపాధ్యాయులు రావడం లేదు. 2018 డీఎస్సీలో 2 పోస్టులు మాత్రమే భర్తీ చేశారు. ప్రస్తుతం 13 ఖాళీలు ఉన్నాయి. నలుగురు మాత్రమే పని చేస్తున్నారు. వీరు 400 మంది విద్యార్థులకు ఎలా బోధన చేస్తారనే ప్రశ్నలు వస్తున్నాయి. గురజాలలో 16 మంది ఉపాధ్యాయులు పని చేయాల్సి ఉండగా ఆరుగురు, వినుకొండ ప్రభుత్వ పాఠశాలలో 25 మంది ఉపాధ్యాయులు గాను ఆరుగురు మాత్రమే పని చేస్తున్నారు. ఆయా పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

# సాగర్‌కు తగ్గిన వరద



విజయపురిసౌత్ :ఆగస్టు 28(సందేశం టైమ్స్): శ్రీశైలం జలాశయం నుండి నాగార్జున సాగర్ జలాశయానికి వరదనీటి ఉధృతి తగ్గింది. సాగర్‌కు ఎగువన శ్రీశైలం నుండి 161971 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా అదేమొత్తంలో నీటిని కిందికి విడుదల చేస్తున్నారు. ఇందుకుగాను నాగార్జునసాగర్ 14 క్రస్ట్ గేట్లను 5 అడుగుల వకు ఎత్తారు. కుడి కాల్వకు 9387 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 8807 క్యూసెక్కుల, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 33739 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసికి 2400 క్యూసెక్కులు, వరద కాల్వకు 300 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 585.90 అడుగుల వద్ద ఉంది. ఇందులో నిల్వ ఉన్న నీరు 300.0315 టీఎంసీలకు సమానం.

# ధర రూ. 266.. అమ్ముతోంది రూ.300



కొత్తపట్నంఆగస్టు 28(సందేశం టైమ్స్): సాగు సమయం ఆసన్నమైంది.. రైతులు యూరియా కోసం పరుగులు పెడుతున్నారు.. ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియాను సకాలంలో అందించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఇలాంటి సమయంలో రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు నిలువుదోపిడికీ దిగుతున్నారు. ఎరువులు పురుగుమందుల దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు అధిక ధరలకు విక్రయించకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యమైంది. దీనిపై ఫిర్యాదులు అందుకున్న జేసీ గోపాలకృష్ణ నేరుగా రంగంలోకి దిగారు. కొత్తపట్నంలో ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీంతో వ్యాపారుల అసలు గుట్టురట్టయ్యింది. యూరియా బస్తా రూ.266కు అమ్మాల్సి ఉండగా రూ.300కు అమ్ముతున్నారు. కొత్తపట్నంలోని శివాలయం వీధిలో ఉన్న షా ఎంటర్‌ప్రైజెస్ దుకాణాన్ని జేసీ తనిఖీ చేశారు. రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. యూరియా బస్తా ఎంతకు అమ్ముతున్నారంటూ వాకబుచేశారు. రూ.300లకు విక్రయిస్తున్నారని చెప్పటంతో షా ఎంటర్‌ప్రయిజెస్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. అంతేగాక దుకాణంలో ఉన్న 4.86 మెట్రిక్ టన్నుల యూరియాను సీజ్ చేశారు. అనంతరం ఆయన రాజుపాలెంలోని బాలాజీ ఏజెన్సీసలోని ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. ఆ ప్రాంతంలోని రైతులతో కూడా జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి కిషోర్‌బాబు తదితరులు ఉన్నారు.

# పాతపట్నంలో వివాహిత..



పాతపట్నంఆగస్టు 28(సందేశం టైమ్స్): స్థానిక ప్రశాంతినగర్‌లో నివాస ముంటున్న దీపిక కుమారి అలియాస్ సీతాదేవి చౌదరి(23) అనే వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. దీపిక భర్త హీరారామ్ స్థానికంగా హార్డ్‌వేర్ వ్యాపారం చేస్తున్నాడు. రాజస్థాన్ చెందిన వీరికి నాలుగేళ్ల కిందట వివాహం జరిగింది. ప్రశాంతి నగర్‌లో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. వీరితో పాటు హీరారామ్ సోదరుడు, బావ, మామయ్య కూడా అదే ఇంట్లో ఉంటూ హార్డ్‌వేర్ షాపులో పనిచేస్తున్నారు. దీపిక రాజస్థాన్ నుంచి నెలరోజుల కిందటే ఇక్కడకి వచ్చింది. కుటుంబ సభ్యులంతా పనికి వెళ్లిపోతుండడంతో ఇంట్లో ఒక్కరే ఉంటుంది. ఆమెకు తెలుగురాకపోవడంతో స్థానికంగా ఎవరితో మాట్లాడే అవకాశాలు లేకపోతున్నాయి. ఈ నెల 25న మధ్యాహ్నం ఎవరో బయట నుంచి ఇంటి తలుపు కొట్టడంతో భయపడి భర్తకు ఫోన్ చేసింది. దీంతో భర్త వచ్చి తలుపు కొట్టగా.. ఎవరో అనుకుని ఆమె తలుపులు తీస్తూ బాత్‌రూం క్లీనింగ్ ద్రావణాన్ని ఒక్కసారిగా విసిరింది. ఆ ద్రావణం హీరారామ్ కళ్లలోకి పడింది. దీంతో హీరారామ్ ఆసుపత్రికి వెళ్లి చూపించగా కంటి చూపునకు ఇబ్బందికలిగేలా ఉందని వైద్యులు చెప్పారు. దీంతో భర్త తరపు కుటుంబ సభ్యులు ఏమైనా అంటారేమోనని దీపిక భయపడి మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన పడకగదిలో సీలింగ్ ఫ్యాన్‌కి చీరకట్టుకొని ఉరివేసుకుంది. షాపు నుంచి ఇంటికి వచ్చిన ఆమె మరిది దీపికను చూసి కిందకు దించాడు. అప్పటికే ఆమె మృతి చెంది ఉంది. సమాచారం అందుకున్న ఎస్ఐ బి.లావణ్య ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఉన్నతాధికారులకు ఆమె సమాచారమివ్వగా టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. భర్త హీరారామ్ ఇచ్చిన సమాచారం మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇది బలవన్మరణమా? లేదా ఇతరత్రా కారణాలు ఉన్నాయా అన్న సందేహాలను పోలీసులు సైతం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# పోలీస్‌స్టేషనలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



కళ్యాణదుర్గంఆగస్టు 28(సందేశం టైమ్స్): కంబదూరు గ్రామానికి చెందిన ప్రకాశ అక్కడి పోలీసస్టేషనలోనే ఆత్మహత్యకు యత్నించిన సంఘటన జరిగింది. కంబదూరుకి చెందిన ప్రకాశ వద్ద టెట్రా ప్యాకెట్లు దొరడంతో పోలీసులు అతడిని పట్టుకుని వచ్చారు. మంగళవారం స్టేషనకు ప్రకాశను పిలిపించారు. అంతలోనే ప్రకాశ స్టేషనలో ఉన్న కిచెన రూమ్‌లోకి వెళ్లి ఓ పదునైన కత్తిని తీసుకుని తన ఎడమ చేతిని కోసుకున్నాడు. దీన్ని గమనించిన ఓ కానిస్టేబుల్ సహచర పోలీస్ సిబ్బంది సాయంతో అతడిని కంబదూరు ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. అధిక రక్తస్రావం కావడంతో ప్రకాశ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు ఈ సంఘటనను గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఈ విషయమై కళ్యాణదుర్గం రూరల్ సీఐ నీలకంఠేశ్వర్‌ను వివరణ కోరగా అరెస్టు చేస్తారని పోలీసులనే భయపెట్టడానికే ఇలా ఆత్మహత్యకు యత్నించాడన్నారు. ప్రకాశపై గతంలో కర్ణాటక మద్యం కేసులో 2 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

# పారా జాతీయ స్థాయి పోటీలకు పయనం

విజయనగరం టౌన్ ఆగస్టు 28(సందేశం టైమ్స్): మధ్యప్రదేశ్ లోని గ్వాలియర్ వేదికగా ఈనెల 29 నుండి 31 వరకు జరుగబోయే 15 వ పారా జూనియర్, సబ్ జూనియర్స్ జాతీయ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ -2025 పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుండి పారా క్రీడాకారులు బయల్దేరి వెళ్లారు. వీరందరికి పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారా రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో ఉమ్మడి విజయనగరం జిల్లా నుండి 13 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. గతం కంటే ఈసారి దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరువుతున్నారని, జాతీయ స్థాయి పోటీలలోనూ బాగా రాణించి క్రీడల్లో జిల్లా కీర్తి, ప్రతిష్టలు మరింతగా పెంచాలని అన్నారు.

# పెళ్లి చేసుకుంటే పిల్లలు పుట్టరనే ఆందోళనతో..

సీతానగరంఆగస్టు 28(సందేశం టైమ్స్): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం సింగవరం గ్రామానికి చెందిన బిట్ర సూరిబాబు (24) కలుపు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల ప్రకారం.. సూరిబా బు రాజమహేంద్రవరం ఆసుపత్రిలో వరి బీజం ఆపరేషన్ చేయించుకున్నాడు. అప్పటి నుంచి ఆందోళనగా ఉంటున్నాడు. ఆ ఆపరేషన్ వల్ల పెళ్లి చేసుకుంటే పిల్ల లు పుట్టరనే ఆందోళనతో మానసిక వేదనకు గురై సోమవారం సాయంత్రం గ్రామంలోని పామాయిల్‌తోటలోకి వెళ్లి కలుపుమందు తాగాడు. ఆత్మహత్య చేసుకుంటున్నానని, కలుపుమందు తాగేశానని కోట సతీష్ అనే వ్యక్తికి చెప్పగా అతడు ఉప్పల దుర్గాప్రసాద్‌కు చెప్పాడు. అత డు విషయాన్ని సూరిబాబు కుటుంబ సభ్యులకు చేరవేశాడు. దీంతో బంధువులు, స్నేహితులు పామాయిల్ తోటకు వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న సూరిబాబును సీతానగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందు తూ ఉదయం మృతిచెందాడు. ఈ మేరకు సూరిబాబు తండ్రి బిట్ర శ్రీను పోలీసులకు ఫిర్యాదు చే శాడు. పోస్టుమార్టం చేయించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు

# డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన



నరసన్నపేట,ఆగస్టు 28(సందేశం టైమ్స్): :మెగా డీఎస్సీ మెరిట్ లిస్ట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 28న జరగనుంది. శ్రీకాకుళంలోని మహాలక్ష్మినగర్‌లో(డీఈవో కార్యాలయం వెనుక) విశ్వవిజేత జూనియర్ కళాశాలలో ఈ ప్రక్రియ నిర్వహణకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో వివిధ కేటగిరిలకు చెందిన 543 మంది అభ్యర్థుల సర్టిపికెట్లను పరిశీలించనున్నారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి ప్రక్రియ ప్రారంభం కానుంది. కళాశాలలో 15 గదులను సిద్ధం చేశారు. సర్టిఫికెట్ల పరిశీలన కోసం ఎంఈవోలు, గెజిటెడ్ హెచ్ఎం, డిప్యూటీ తహసీల్దార్, ఎంఐఎస్ ఆపరేటర్లతో కూడిన 12 తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. మరో రెండు బృందాలను రిజర్వులో ఉంచారు. ప్రతీ బృందం 50 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను తనిఖీ చేసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలి. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లతో.. అభ్యర్థులు తీసుకువచ్చే కులధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్లు, మిగిలిన విద్యార్హత సర్టిఫికెట్లను ఇతర బృందం సభ్యులు పరిశీలిస్తారు. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు విద్యాశాఖ పరిశీలకుడిని నియమించింది. అలాగే డీఈవో, డీవైఈవో, ఎగ్జామ్స్ ఏడీలు ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. కళాశాలలో ఇంటర్ నెట్, విద్యుత్, తదితర సదుపాయాలకు అంతరాయం లేకుండా ఆయాశాఖ అధికారులకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు జారీ చేశారు. అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లు, మూడు సెట్ల అటెస్టెడ్ జిరాక్స్ కాపీలు, కులధ్రువీకరణ, డిజేబుల్డ్ సర్టిఫికెట్, స్టడీ / రెసిడెన్షియల్ సర్టిఫికెట్, టెట్ మార్కుల కాపీ, డీఎస్సీ హాల్ టికెట్, ఆధార్ కార్డు, 5 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలి. ముందుగా అభ్యర్థి తన ఒరిజనల్ సర్టిఫికెట్లను వ్యక్తిగత లాగిన్‌లో స్కాన్ చేసి ఏపీడీఎస్సీ. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. అభ్యర్థితోపాటు సహాయకుడిగా లోపలకు ఒకరినే మాత్రమే అనుమతిస్తారు.

# విద్యుత్ అమర వీరుల సంస్మరణ సభ



గుంటూరు :ఆగస్టు 28(సందేశం టైమ్స్): విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ సభ ఈనెల 28న ఉదయం 10 గంటలకు గుంటూరు లాడ్జి సెంటర్ వద్ద నిర్వహిస్తున్నట్లు వామపక్ష పార్టీల నాయకులు తెలిపారు. బ్రాడీపేటలోని సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు కె.నళినీకాంత్, ఎ.అరుణ్‌కుమార్ సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు నరసింహారావు, సిపిఐ (ఎంఎల్) నాయకులు కోటయ్య, ఎంసిపిఐ (యు) నాయకులు నాగలక్ష్మి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో భాగంగా 2000 సంవత్సరం, ఆగస్టు 28న హైదరాబాద్‌లో బషీర్‌బాగ్ వద్ద జరిగిన పోరాటంపై ప్రభుత్వం పోలీసు కాల్పులు జరిపిందని, కాల్పుల్లో విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, బాలస్వామి ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. నాటి పోరాట ఫలితంగా దాదాపు 15 ఏళ్లపాటు ఏ ప్రభుత్వమూ విద్యుత్ చార్జీలు పెంచలేదన్నారు. రాష్ట్ర విభజన అనంతరం టిడిపి, వైసిపి ప్రభుత్వాలు ట్రూ అప్, ఇందన సర్దుబాటు ఛార్జీల పేరుతో వినియోగదారులపై రూ.వేలాది కోట్లు భారం మోపిందని విమర్శించారు. విద్యుత్ రంగం ప్రైవేటీకరణ కోసం స్మార్ట్ మీటర్లను తెచ్చారని, వాటికి అయ్యే ఖర్చును కూడా ప్రజల నుండే వసూలు చేస్తారన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ చార్జీలు పెరుగుతాయన్నారు. ప్రస్తుత విద్యుత్ భారాలపై విద్యుత్ అమర వీరుల స్ఫూర్తితో పోరాడాలని, సంస్మరణ సభలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వామపక్షపార్టీల నాయకులు బి.ముత్యాలరావు, కోటేశ్వరరావు, ఖాశింషహీద్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



ఆదోనిరూరల్ ఆగస్టు 28(సందేశం టైమ్స్): మండలం ప్రజల పెద్దహరివాణం గ్రామంలో స్థానిక విజేత టాలెంట్ ఇంగ్లీష్ స్కూల్లో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి ఆధ్వర్యంలో గురువారం పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించగా 2,3,4,5, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 2వ తరగతి విద్యార్థి శ్రీనిధి, 3వ తరగతి విద్యార్థి కే.భాను, 4వ తరగతి విద్యార్థి సమిత,5వ తరగతి విద్యార్థి గజేంద్ర చిత్రలేఖన పోటీలో మొదటి బహుమతి గెలుచుకున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు తార, కాలింగ, మహబూబ్ బాషా మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగువున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు ఉపాధ్యాయులు వెల్లడించారు.

# వానలే వానలు.. పలు జిల్లాలు అతలాకుతలం




ఆగస్టు 28(సందేశం టైమ్స్): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షం కురుస్తోంది. నగరాలతో పాటు పట్టణాలు, గ్రామాలు జలమయం అయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రమంతా జనసంచారం స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాల్లో భారీగా వరద నీరు చేరడంతో.. ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకున్నారు. పలు జిల్లాల్లో.. రహదారులపై నీరు చేరింది. మరోకొన్ని చోట్ల.. ప్రధాన రహదారులు వర్ష బీభత్సానికి కొట్టుకుపోయాయి. దీంతో పలు జిల్లాలకు రాకపోకలు నిలిపివేశారు అధికారులు. చెరువులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. రాష్ట్రంలో ఒక్కసారిగా కుంభవృష్టి చోటుచేసుకోవడంతో.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.అలాగే.. హైదరాబాద్‌లో కూడా నిన్నటి నుంచి ఎడతెరిపి వర్షాలు కురుస్తున్నాయి. రహదారులన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాలు అన్ని చెరువులను తలపిస్తున్నాయి. నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని లింగంపల్లి, మియాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం, జూబ్లీహిల్స్, అమీర్‌పేట, నాంపల్లి, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, హయత్‌నగర్, మేడ్చల్, శామీర్‌పేట్ తదితర ప్రాంతాల్లో నిన్నటి నుంచి వర్షం కురుస్తోంది. ఈ మేరకు అధికారులు అప్రమత్తమై నగరాల్లో సహాయక చర్యలు చేపడుతున్నారు.కాగా, రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న కుండపోత వర్షాలకు పలు జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. కామారెడ్డి జిల్లాలో కుంభవృష్టి వర్షం భీభత్సం సృష్టించింది. ఎన్నడూ లేని విధంగా రాజంపేట మండలం వద్ద ఉన్న అర్గొండ స్టేషన్‌లో 42 సెం.మీ వర్షపాతం నమోదైంది. భారీ వరదల కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్లు, గ్రామాలు, పట్టణాలు చాలా వరకు నీళ్లలో కూరుకుపోయాయి. దీంతో జిల్లాలో దీంతో జనజీవనం స్తంభించిపోయింది. మొత్తం 10 ప్రదేశాలలో 20 సెం.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. దీంతో కామారెడ్డిలోని హౌసింగ్ బోర్డు కాలనీ పూర్తిగా జలమయం అయ్యింది. కాలనీలోని ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకున్నారు. కాలనీలో వరద ప్రవాహానికి కార్లు, బైకులు వరదలో కొట్టుకుపోయాయి. వెంటనే అప్రమత్తం అయిన అధికారులు సహాయ చర్యలు ప్రారంభించారు. కాలనీలో చిక్కుకపోయిన ప్రజలను రక్షిస్తున్నారు. అత్యవసరం అయితేనే ప్రజలు ఇండ్ల నుంచి బయటికి రావాలని అధికారులు సూచిస్తున్నారు. రేపు, ఎల్లుండి భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నాయని వెల్లడించారు. ఇప్పటి వరకు కామారెడ్డిలో అంత వర్షపాతం నమోదు కాలేదని స్థానికులు చెబుతున్నారు. వర్షాకాలం మొదలయ్యాక ఒక్క రోజులో హైయెస్ట్ రెయిన్ ఫాల్ నమోదు కావడం ఇదే తొలిసారి.

# మున్నేరు పరివాహక ప్రాంతాలకు అలర్ట్.. మొదటి హెచ్చరిక జారీ అయ్యే అవకాశం



ఖమ్మం ఆగస్టు 28(సందేశం టైమ్స్): జిల్లా ఉన్నతాధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. మున్నేటికి ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో మున్నేరుకి వరద ముప్పు పొంచి ఉందని తెలిపారు. ప్రస్తుతం ఖమ్మం వద్ద మున్నేరు 14.50 అడుగుల మేర ప్రవహిస్తోందని పేర్కొన్నారు. జిల్లా అధికార యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.ముందస్తు.. సహాయక చర్యల్లో భాగంగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలి మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. ముందుగా ముంపుకు గురి అయ్యే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. పునరావాస కేంద్రాల వద్ద అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. మున్నేరు పరివాహక ప్రాంతంలో ఉన్న 12 డివిజన్లలోని ప్రజలకు అవసరమైన అత్యవసర తక్షణ సహాయం అందించాలని జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులను ఆదేశించారు.మంత్రి తుమ్మల ఆదేశాలతో అధికార యంత్రాంగం చర్యలు మొదలు పెట్టింది. మున్నేరు పరివాహక ప్రాంతంలోని డివిజన్లో పర్యటిస్తూ.. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేస్తున్నారు అధికారులు. ఖమ్మం వద్ద ఉధృతంగా మున్నేరు ప్రవహిస్తుంది. 15 అడుగుల మేర ప్రవాహం కొనసాగుతున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. 16 అడుగులకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది. ఈ రాత్రికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మున్నేరు పరివాహక ప్రాంతంలో ముంపుకు గురయ్యే ప్రాంతాలను శాటిలైట్ ద్వారా గుర్తించి ఆయా ప్రాంతాల్లో అధికార యంత్రాంగం సహాయక చర్యలు ప్రారంభించింది.

# యూరియా కష్టాలు

## - పీఏసీఎస్‌ల వద్ద రైతుల బారులు
## - వారం రోజులుగా మారని తీరు
## - విసిగివేసారి ఆందోళన బాట



భూత్పూర్/నవాబ్‌పేట/మూసాపేట/తెలకపల్లి/బిజినేపల్లి/మిడ్జిల్/గోపాల్‌పేట, ఆగస్టు 28(సందేశం టైమ్స్): యూరియా కోసం రైతులకు అరిగోస తప్పడం లేదు. కీలక సమయంలో పొలం పనులను వదిలి ప్రాథమిక సహకార సంఘం కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు. యూరియా ఇవ్వాలంటూ అధికారులను వేడుకుంటున్నారు. పొద్దస్తమానం పడిగాపులు పడిగాపులు కాస్తున్నారు. విసిగి వేసారి ఆందోళన బాట పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్, నవాబ్‌పేట, మిడ్జిల్, మూసాపేట మండలంలోని పోల్కంపల్లి, నాగర్‌కర్నూల్ జిల్లాలోని తెలకపల్లి, బిజినేపల్లి తదితర కేంద్రాల్లో రైతులు ఆందోళన చేపట్టారు.- మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండల కేంద్రంలోని చౌరస్తాలో రైతులు రాస్తారోకో చేపట్టారు. పలుకుబడి ఉన్నోళ్లకు లోలోపల ఇచ్చేస్తున్నారంటూ ఆరోపించారు. విషయం తెలుసుకున్న సీఐ రామకృష్ణ, ఏవో మురళీధర్, ఎస్ఐ చంద్రశేఖర్ రైతులతో మాట్లాడారు. రెండు రోజుల్లో రైతులకు అవసరమైన మేరకు యూరియా ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.- నవాబ్‌పేట మండల కేంద్రంలోని ఎర్రసత్యం చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సింగిల్ విండో చైర్మన్ మోడెమోని నర్సింహులు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రవీందర్‌రెడ్డి రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్, గండు చెన్నయ్య, ప్రతాప్, రాజునాయక్, ఆలి, నాగిరెడ్డి పాల్గొన్నారు.- మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట మండలంలోని పోల్కంపల్లి పీఏసీఎస్ ముందు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు గడ్డమీది ఇంద్రయ్యసాగర్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ వారికి సంఘీభావం తెలిపారు. అనంతరం సీఈవో భాస్కర్‌గౌడ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ధర్నాలో నాయకులు పల్లి శివరాములు, నర్సింహులుగౌడ్, గూపని కొండయ్య, రవిందర్‌గౌడ్, మధు, లక్ష్మీనరసింహ, బాలయ్య, పెద్దవెంకటయ్య, మధు, ఆంజనేయులు, కాశీనాథ్, రాజు, కత్తి వెంకటేశ్, యాదయ్య, చంద్రయ్యగౌడ్, రాఘవేందర్‌గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.- మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలంలోని రాణిపేట పీఏసీఎస్ ముందు రైతులు అధికసంఖ్యలో బారులు తీరారు. పొలం పనులను వదిలిపెట్టి ఇక్కడ వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.- నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో రైతులు రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నరేశ్ రైతులను సముదాయించారు. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు.- నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండల కేంద్రంలోని మన గ్రోమోర్ దుకాణం ముందు యూరియా కోసం రైతులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. అయితే ఉన్న యూరియాను అందరికీ సరిపోదని భావించి యజమాని దుకాణాన్ని మూసివేశారు. దీంతో రైతులు అక్కడే ధర్నా చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని వారిని శాంతిప చేశారు.- వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలోని మన గ్రోమోర్ దుకాణానికి రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను వరుస క్రమంలో పంపించి అందరికీ యూరియా అందేలా చర్యలు తీసుకున్నారు.

# ప్రమాదవశాత్తు కాల్వలో పడి వృద్ధుడు మృతి



మూసాపేట ఆగస్టు 28(సందేశం టైమ్స్): ప్రమాదవశాత్తు వృద్ధుడు కాల్వలో పడి మరణించిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని సంకలమద్ది గ్రామంలో చోటుచేసుకుంది. వృద్ధుడు కొత్త కాలువలో పడి మృతిచెందాడు. మూసాపేట మండలంలోని తుంకినిపూర్ గ్రామానికి చెందిన లిక్కి వెంకటయ్య (71) సంకలమద్ది గ్రామానికి బంధువుల ఇంటికి వెళ్లాడు. తుంకినిపూర్‌కు తిరిగివెళ్తూ కాల్వలోపడి మరణించాడు. %అయితే సంకలమద్ది గ్రామంలో ఉన్నాడని కుటుంబసభ్యులు, ఇంటికి వెళ్లిపోయాడని బంధువులు అనుకున్నారు. ఈ క్రమంలో ఉదయం సంకలమద్ది బండ్ల గడ్డ సమీపంలో ఉన్న కొత్త కాలువ వద్దకు వెళ్లిన ఓ యువకుడికి వెంకటయ్య మృతదేహం కనిపించింది. దాంతో విషయం కాలనీవాసులకు చెప్పాడు. కాలనీ వాసులు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.కాల్వలో నుంచి మృతదేహాన్ని బయటకి తీసేందుకు కాలనీవాసులు, పోలీసులు తీవ్రంగా శ్రమించారు. మృతునికి భార్య ఉత్తమ్మతోపాటు ఇద్దరు కుమార్తెలు మణెమ్మ, శ్రీదేవి, కుమారుడు సురేష్ ఉన్నారు. మరో కుమారుడు గత కొన్ని రోజులుగా కనిపించకుండా పోయాడు.

# బాలింతకు దారి కష్టాలు



బోథ్, ఆగస్టు 28(సందేశం టైమ్స్): ఆదిలాబాద్ జిల్లా సొనాల మండలం చింతల్‌బోరి గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దగూడకు చెందిన మండాడి రేణుక బోథ్ సీహెచ్‌సీలో ఈనెల 21న పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. సీహెచ్‌సీ నుంచి పెద్దగూడ గ్రామానికి 102 వాహనంలో బయలుదేరింది. గ్రామానికి ఆనుకొని వాగు ఉండడంతో సిబ్బంది సహాయంతో వాగు దాటించి. %వంతెన లేకపోవడంతో తాము అష్టకష్టాలు పడుతున్నామని, వైద్య సేవలకు నోచుకోలేక పోతున్నామని పెద్దగూడ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 102 పైలెట్ భగత్ నవీన్ కుమార్, బాలింతతోపాటు శిశువును వారి ఇంటికి చేర్చారు.

# పగలు రెక్కీ.. రాత్రి చోరీ!




నీలగిరి,ఆగస్టు 28(సందేశం టైమ్స్): ఖరీదైన కార్లలో తిరుగుతూ రాత్రి వేళల్లో మేకల దొంగతనాలకు పాల్పడుతున్న పదహారు మందితో కూడిన నాలుగు అంతర్ జిల్లా దొంగల ముఠాలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. వారి నుంచి రూ. రెండు లక్షల 46వేల నగదు, రూ.2 లక్షల 75వేల విలువైన 22 గొర్రెలు, రూ.47 లక్షల విలువైన 8 కార్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా జిల్లాలో మేకలు, గొర్రెలు చోరీ జరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా సాయంత్రం శాలిగౌరారం మండలంలోని బైరవోనిబండ క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీ చేపడుతున్న సమయంలో ఒక స్విఫ్ట్ డిజైర్ కారు అనుమానాస్పదంగా కనిపించిందన్నారు. %కారు వద్దకు వెళు తుండగా అందులోని వ్యక్తుల తప్పించుకొని పారిపోయేందుకు యత్నించినట్లు తెలిపారు. వెంటనే వాహనాన్ని వెంబడించి పట్టుకోగా అందులో ముగ్గురు పురుషులు, ఓ మహిళ ఉన్నట్లు తెలిపారు. వారి వేలిముద్రలను సానర్‌తో చెక్ చేయగా సంపంగి వెంకటేష్, వేంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సంపంగి శారద, దాసర్ల వినోద్ కుమార్ అలియాస్ కోటిగా గుర్తించామన్నారు. వీరిపై గతంలో నల్గొండ రూరల్, కనగల్, చండూర్, విజయపురి, నార్కట్‌పల్లి, నల్గొండ 2 టౌన్, మర్రిగూడ, దేవరకొండ, శాలిగౌరారం, నాంపల్లి, మునుగోడు, చింతపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో మేకల చోరీ కేసుల్లో అరెస్టయి జైలుకు వెళ్లి వచ్చినట్ల తేలిందన్నారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా పలు ప్రాంతాల్లో మేకలు, గొర్రెలు చోరీ చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు.

# నర్మాల వాగులో పడి వ్యక్తి గల్లంతు



గంభీరావుపేట :ఆగస్టు 28(సందేశం టైమ్స్): రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, కుంటలు అలుగు దుంకుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. తాజాగా రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల వాగులో పడి ఒకరి గల్లంతయ్యారు. నర్మాల క్యాంపుకు చెందిన పంపుకాడి నాగయ్య బర్లను మేపేందుకు వాగు సమీపానికి వెళ్లారు. భారీ వర్షానికి వాగు ఉధృతంగా ప్రవహించడంతో గల్లంతయినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# క్రీడావార్తలు



## ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్‌కు కేన్సర్.. సర్జరీ చేయించుకున్న ప్లేయర్



ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్, మాజీ లెజెండ్ మైకేల్ క్లార్క్ కేన్సర్ బారిన పడ్డాడు. అతడికి స్కిన్ కేన్సర్ సోకినట్టు తెలిపాడు. స్కిన్ కేన్సర్ కారణంగా మరో సర్జరీ చేయించుకున్నట్టు పేర్కొన్నాడు ఆస్ట్రేలియా జట్టుకు స్టార్ బ్యాటర్‌గా, కెప్టెన్‌గా క్లార్క్ 2004-2015 మధ్య కాలంలో కీలకంగా వ్యవహరించాడు. అతడి నేతృత్వంలోనే ఆస్ట్రేలియా 2013-14 యాషెస్ సిరీస్‌ను, 2015 ప్రపంచకప్‌ను గెలుచుకుంది'నా ముక్కుపై మరో కట్ పడింది. మీ చర్మానికి సంబంధించి పరీక్షలు తరచుగా చేయించుకోండి. చికిత్స తీసుకోవడం కంటే నివారణ చాలా ఉత్తమం. నేను రెగ్యులర్ చెకప్‌లు, ముందస్తుగా గుర్తించడం చాలా కీలకంగా మారాయి. ఆస్ట్రేలియాలో చర్మ కేన్సర్‌లు సర్వసాధారణం' అని క్లార్క్ గుర్తు చేశాడు. క్లార్క్‌కు కేన్సర్ సోకడం ఇదే ప్రథమం కాదు. గతంలో కూడా క్లార్క్‌ను పలు కేన్సర్‌లు వేధించాయి. క్లార్క్‌కు చర్మ కేన్సర్ రావడం ఇది రెండోసారి అని తెలుస్తోంది.ఆస్ట్రేలియాలో చర్మ కేన్సర్‌లు రావడం సహజమే ఆస్ట్రేలియాలో 70 సంవత్సరాల వరకు బతికిన ప్రతి ముగ్గురిలో ఇద్దరు ఏదో ఒక స్కిన్ కేన్సర్ బారిన పడే ఉంటారట. దానికి కారణం అక్కడి వాతావరణం. భూమధ్య రేఖకు సమీపంలో ఉండడం, యూవీ రేడియేషన్ ఎక్కువగా ఉండడం వంటి కారణాలతో ఆస్ట్రేలియన్లు ఎక్కువగా చర్మ కేన్సర్ బారిన పడుతుంటారట.

## ఒక్క బంతికి 20 పరుగులు.. రొమారియో షెపర్డ్ ఏం చేశాడో చూడండి..



ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆటగాడు, వెస్టిండీస్ ఆల్‌రౌండర్ రొమారియ షెపర్డ్ అద్భుతం చేసి చూపించాడు. ప్రస్తుతం జరుగుతున్న కరీబియన్ ప్రీమియర్ లీగ్ )లో గయానా అమెజాన్ వారియర్స్ జట్టు తరఫున ఆడుతూ అద్భుత ఆటతీరుతో అదరగొడుతున్నాడు. సెయింట్ లూసియాతో జరిగిన తాజా మ్యాచ్‌లో ఒక బంతికి 20 పరుగులు రాబట్టి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది సెయింట్ లూసియా బౌలర్ థామస్ వేసిన 15వ ఓవర్ మూడో బంతి నోబాల్ అని అంపైర్ ప్రకటించాడు. ఆ బంతికి రొమారియో పరుగులేమీ చేయలేదు. అయితే అది నో బాల్ కావడంతో థామస్ అదనంగా మరో బంతి వేయాల్సి వచ్చింది. ఆ బంతిని రొమారియా సిక్సర్‌గా మలిచాడు. అయితే అది కూడా నో బాల్ అని తేలింది. ఆ బంతిని కూడా రొమారియా సిక్సర్‌గా మలిచాడు. అయితే అది కూడా నో బాల్ అని తేలింది. ఆ తర్వాత బంతిని కూడా రొమారియా సిక్సర్‌గా మలిచాడు %దీంతో 15వ ఓవర్ మూడో బంతికి రొమారియా మూడు సిక్స్‌లు కొట్టి మొత్తం 20 పరుగులు రాబట్టాడు. మొత్తానికి ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన రొమారియా 34 బంతుల్లో 73 పరుగులు చేశాడు. అందులో మొత్తం 7 సిక్స్‌లు ఉన్నాయి. గత ఐపీఎల్‌లో ఆర్సీబీ తరఫున ఆడిన రొమారియా చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో 14 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. జైస్వాల్ (13 బంతులు) తర్వాత ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ చేసిన ఆటగాడిగా నిలిచాడు.

## కామన్వెల్త్ బిడ్‌కు భారత్ గ్రీన్ సిగ్నల్.. ఈ నగరానికి ఛాన్స్

ఢిల్లీ: 2030 కామన్వెల్త్ గేమ్స్ హోస్ట్ చేయడానికి భారత్ సిద్ధమవుతోంది. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన యూనియన్ కేబినెట్ మీటింగ్‌లో బిడ్ వేసే ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. బిడ్ గెలిస్తే అహ్మదాబాద్‌లో ఈ గ్రాండ్ ఈవెంట్ జరగనుంది. అది కూడా గుజరాత్ సర్కార్‌కి గ్రాంట్ ఇన్ ఎయిడ్‌తో సహా అన్ని సపోర్ట్‌లతో జరగనుంది. ఒకవేళ మన బిడ్ గెలిస్తే, హోస్ట్ కొలాబరేషన్ అగ్రిమెంట్ కూడా సైన్ అవుతుంది.అహ్మదాబాద్?లో వరల్డ్ క్లాస్ స్టేడియంలు, అత్యాధునిక ట్రైనింగ్ ఫెసిలిటీస్, స్పోర్ట్స్ పట్ల ఉన్న ప్యాషన్ సహా అనేకం ఉన్నాయి. నరేంద్ర మోదీ స్టేడియం కూడా ఇక్కడే ఉంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద స్టేడియం. 2023లో క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్‌ని సక్సెస్‌ఫుల్‌గా హోస్ట్ చేసిన ఈ స్టేడియం, %జఔ+% 2030కి కూడా రెడీగా ఉంది. ఇక్కడ అథ్లెట్లు, కోచ్‌లు, టెక్నికల్ ఆఫీసర్లు, టూరిస్టులు, మీడియా పర్సన్స్ సహా అందరూ ఒక చోట అందుబాటులో ఉంటారు.ఈ కామన్వెల్త్ గేమ్స్‌లో 72 దేశాల నుంచి అథ్లెట్లు పాల్గొంటారు. ఇది కేవలం స్పోర్ట్స్ ఈవెంట్ మాత్రమే కాదు, ఒక గ్లోబల్ సెలబ్రేషన్ అని కూడా చెప్పవచ్చు. ఈ ఈవెంట్ వల్ల లోకల్




వ్యాపారాలకు కూడా మేలు జరుగుతుంది. హోటల్స్, రెస్టారెంట్లు, టూరిజం... అన్నీ బూస్ట్ అవుతాయి. అంతేకాదు, ఈ ఈవెంట్ వల్ల ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయి. స్పోర్ట్స్, సైన్స్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్స్, బ్రాడ్‌కాస్ట్, మీడియా, %×ు%, కమ్యూనికేషన్స్... ఇలా ఎన్నో రంగాల్లో యువతకు అవకాశాలు దొరుకుతాయి.2030 భారత్‌లో జరగడం వల్ల స్పోర్ట్స్‌తో పాటు టూరిజం కూడా పెరుగుతుంది. అహ్మదాబాద్‌ని సందర్శించే టూరిస్టులు, గుజరాత్ సంస్కృతి, ఆహారం, హాస్పిటాలిటీని ఎంజాయ్ చేస్తారు. ఇది యువ అథ్లెట్లకు కూడా ఓ స్ఫూర్తి అని చెప్పవచ్చు. స్పోర్ట్స్‌ని కెరీర్‌గా ఎంచుకోవాలనే ఆలోచన ఎంతో మందిలో వస్తుంది. ఇది మన దేశంలో స్పోర్ట్స్ కల్చర్‌ని మరింత పెంచుతుంది.

## అల్కారజ్ అలవోకగా




అమెరికాకు చెందిన తెలుగు సంతతి ఆటగాడు నిశేష్ బసవా రెడ్డి తొలి రౌండ్లోనే వెనుదిరిగాడు. 9వ సీడ్ ఖచనోవ్‌తో జరిగిన పోరులో తొలి సెట్ గెలిచిన బసవా రెడ్డి 7-6 (5), 3-6, 5-7, 1-6తో ఓడాడు. ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన బసవా రెడ్డి కుటుంబం అమెరికాలో స్థిరపడింది.న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో రెండో రోజు పురుషుల సింగిల్స్ బరిలోకి దిగిన స్పెయిన్ సంచలనం కార్లోస్ అల్కారజ్‌తో పాటు కాస్పర్ రూడ్, ఖచనోవ్, అంద్రీ రుబ్లెవ్, హోల్గర్ రూన్, ఫ్రాన్సెస్ టియాఫోలాంటి సీడెడ్‌లంతా రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. మహిళల్లో మాత్రం ఆరో సీడ్ మాడిసన్ కీస్, ఉక్రెయిన్ స్టార్ స్విటోలినా, వెటరన్ ఏస్ వీనస్ విలియమ్స్ ఆరంభంలోనే ఇంటిబాట పట్టారు. స్థానిక ఆటగాడు రిలీ ఓపెల్కాతో జరిగిన పోరును మాజీ చాంపియన్ అల్కారజ్ 6-4, 7-5, 6-4తో వరుససెట్లలో ముగించాడు. కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్‌ను మూడేళ్ల క్రితం (2022) ఇక్కడే నెగ్గిన 22 ఏళ్ల అల్కారజ్.. గ్రాండ్‌స్లామ్స్‌లో తొలి రౌండ్ విజయాల రికార్డును 19-0తో మరింత పదిలం చేసుకున్నాడు. 11వ సీడ్ రూన్ 6-3, 7-6 (4), 7-6 (2)తో బొటిక్ వాన్‌పై, 12వ సీడ్ రూడ్ 6-1, 6-2, 7-6 (5)తో సెబాస్టియన్‌పై, 15వ సీడ్ రుబ్లెవ్ 6-4, 6-4, 6-4తో ప్రిజ్‌మిక్‌పై, 17వ సీడ్ టియాఫో 6-3, 7-6 (6), 6-3తో నిషిఒకపై గెలిచారు. %కీస్.. 89 తప్పిదాలు: ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గి జోరుమీదున్న అమెరికా స్టార్ క్రీడాకారిణి మాడిసన్ కీస్‌కు సొంతగడ్డపై మాత్రం చుక్కెదురైంది. మెక్సికోకు చెందిన 82వ ర్యాంకర్ రెనటా జరజువా 6-7 (12), 7-6 (3), 7-5తో కీస్‌ను కంగుతినిపించి రెండో రౌండ్ చేరింది. 3 గంటలా పది నిమిషాల హోరాహోరీ పోరులో కీస్.. ఏకంగా 89 అనవసర తప్పిదాలు, 14 డబుల్ ఫాల్ట్స్ చేసి మ్యాచ్‌ను చేజార్చుకుంది.

## ధోని కంటే ఎక్కువ జీతం తీసుకుంటున్న అశ్విన్.. ఐపీఎల్? విషయంలో షాకింగ్ నిర్ణయం..

ఐపీఎల్ లెజెండ్ రవిచంద్రన్ అశ్విన్ గురించి షాకింగ్ న్యూస్ వచ్చింది. బుధవారం (ఆగస్టు 27, 2025) అశ్విన్ ఐపీఎల్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. చెన్నై సూపర్ కింగ్స్ లో తిరిగి చేరిన ఈ స్టార్ స్పిన్నర్, ఇంకా కొన్ని సీజన్లు ఆడతాడని అందరూ ఊహించారు. కానీ, అతను ఊహించని నిర్ణయం తీసుకుని ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పాడు . ప్రతి ముగింపు కొత్త ప్రారంభానికి నాంది. నా ఐపీఎల్ జర్నీ ఇక్కడ ముగిసింది. కానీ ఇతర లీగ్‌లలో కొత్త అనుభవాలు పొందే సమయం మొదలైందని అశ్విన్ ఎక్స్‌లో పోస్ట్ చేసి ప్రకటించాడు.ఐపీఎల్ 2025 మెగా వేలంలో అశ్విన్‌ను సీఎస్‌కే రూ. 9.75 కోట్లకు సొంతం చేసుకుంది. ఇది మన థలా ధోని కంటే దాదాపు రూ. 6 కోట్లు ఎక్కువ కావడం విశేషం. ధోనిని సీఎస్‌కే అన్‌క్యాప్డ్ కేటగిరీలో రూ. 4 కోట్లకు రిటైన్ చేసింది. అంటే, అశ్విన్ జీతం ధోని కంటే రూ. 5.75 కోట్లు ఎక్కువ. సీఎస్‌కే అశ్విన్‌ను తిరిగి తీసుకోవడానికి లక్నో సూపర్ జెయింట్స్,




రాజస్థాన్ రాయల్స్‌లతో పోటీపడి వేలంలో గెలిచింది.సీఎస్‌కేలో అశ్విన్ హోమ్‌కమింగ్ అంత గొప్పగా సాగలేదు. 2025 సీజన్‌లో అతను 9 మ్యాచ్‌లలో కేవలం 7 వికెట్లు మాత్రమే తీశాడు. ఎకానమీ రేట్ 9.13తో బౌలింగ్ చేశాడు. ఇది అశ్విన్ స్థాయికి చాలా తక్కువ పర్ఫార్మెన్స్ అని చెప్పాలి. అయినా, అతని ఐపీఎల్ కెరీర్ మొత్తం చూస్తే, సీఎస్‌కే తరఫున 106 మ్యాచ్‌లలో 97 వికెట్లు తీసిన రికార్డ్ ఉంది.అశ్విన్ ఐపీఎల్‌లో సీఎస్‌కేతో 2008లో తొలి సీజన్‌లోనే చేరాడు. 2009లో డెబ్యూ చేసి, 2010, 2011లో సీఎస్‌కే ఛాంపియన్‌గా నిలిచిన టీంలో కీలక పాత్ర పోషించాడు. ఆ పర్ఫార్మెన్స్‌తోనే అతనికి భారత జట్టులో చోటు దక్కింది.

## సింధు ప్రణయ్ ముందంజ

పారిస్: బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిపలో భారత ఏస్ షట్లర్లు పీవీ సింధు, హెచ్‌ఎస ప్రణయ్ రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో మాజీ చాంపియన్ సింధు 23-21, 21-6తో కలోయనా నల్బంటోవా (బల్గేరియా)పై వరుస గేమ్‌ల్లో గెలిచింది. తొలి గేమ్ ఆరంభంలో తడబడిన సింధు 0-4తో వెనుకబడింది. అయితే, 2-6తో ఉన్న సమయంలో నల్బంటోవా తప్పిదాలతో సింధు 5-7తో ఆధిక్యం తగ్గించింది. కానీ, బల్గేరియా షట్లర్ 11-7తో బ్రేక్‌కు వెళ్లింది. తిరిగి వచ్చిన తర్వాత పవర్‌ఫుల్ స్మాష్‌లతో విరుచుకుపడ్డ సింధు 12-12తో స్కోరు సమం చేసింది. 20-




20 వద్ద మరోసారి స్కోరు సమం చేసిన సింధు.. గేమ్‌ను తన ఖాతాలో వేసుకొంది. రెండో గేమ్‌లో సింధు జోరుకు నల్బంటోవా చేతులెత్తేసింది.

## చోప్రాకు కఠిన సవాల్



న్యూఢిల్లీ: మరోసారి డైమండ్ లీగ్ (డీఎల్) టైటిల్ సొంతం చేసుకోవాలనుకొంటున్న భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు గట్టిపోటీ ఎదురుకానుంది. స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌లో గురువారం రాత్రి జరిగే డీఎల్ ఫైనల్లో సమకాలీన ప్రత్యర్థులు.. డిఫెండింగ్ చాంప్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), జూలియన్ వెబర్ (జర్మనీ) కూడా బరిలో నిలవనున్నారు. రెండు ఒలింపిక్ పతకాలు నెగ్గిన చోప్రా సెలెసియా, బ్రస్సెల్స్‌లో జరిగిన డైమండ్ లీగ్‌ల్లో పాల్గొనలేదు. దోహా, పారిస ఈవెంట్లలో బరిలోకి దిగిన నీరజ్ నాలుగో స్థానంతో ఫైనల్‌కు అర్హత సాధించాడు. గత మేలో దోహాలో జరిగిన ఈవెంట్‌లో చోప్రా 90.23 మీటర్ల దూరం విసిరినా..

# బిజినెస్



## 2038 నాటికి ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్



ఇప్పటివరకు అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉన్న ఇండియా, త్వరలోనే ప్రపంచంలో టాప్ ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలవబోతోంది. ఈ విషయం ఏదో ఊహ కాదు... ప్రముఖ అంతర్జాతీయ కాంపెనీ తాజా నివేదిక ప్రకారం, 2038 నాటికి భారతదేశం కొనుగోలు శక్తి సమతుల్యత ( ప్రకారం ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగబోతుంది. కొంతమందికి %ఔూా% అన్న పదం కొత్తగా అనిపించవచ్చు. సింపుల్‌గా చెప్పాలంటే, ఒక్కో దేశంలో ఒకే తరహా వస్తువులకు ఉన్న ధరల తేడా ఆధారంగా ఆ దేశం ఆర్థిక శక్తిని అంచనా వేస్తారు. దీనివల్ల వాస్తవానికి ప్రజలు ఎంత కొనగలుగుతున్నారన్న దాని మీద స్పష్టమైన అవగాహన వస్తుంది. ఈ నివేదిక అంచనాల ఆధారంగా రూపొందించబడింది. 2030 నాటికి భారత్ ఆర్థిక వ్యవస్థ %వి%20.7 ట్రిలియన్ స్థాయికి చేరుకుంటుందని అంచనా. ఇది అమెరికా, జర్మనీ, జపాన్ లాంటి పెద్ద దేశాల కంటే ఎక్కువ కావడం విశేషం.

## బంగారం ధరల్లో పెరుగుదల.. నేటి రేట్స్ ఏంటంటే..




%ఇంటర్నెట్ డెస్క్: భారత్‌పై అమెరికా సుంకాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. రేట్లు క్రమంగా పెరుగుతున్నాయి . గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,02,450గా ఉంది. 22 క్యారెట్ 10 గ్రాముల గోల్డ్ ధర రూ.93,910గా ఉంది. ఇక 18 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.76,840గా ఉంది. కిలో వెండి ధర రూ.1,19,900గా ఉంది. 10 గ్రాముల ప్లాటినం ధర రూ.38,090గా ఉంది.

## ఫార్మాపై జీఎస్టీని హేతుబద్ధీకరించాలి




న్యూఢిల్లీ: ప్రతిపాదిత జీఎస్టీ సంస్కరణలు ఫార్మా పరిశ్రమకు తోడ్పడేలా ఉండాలని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ చైర్మన్ సతీష్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ సంస్కరణలు హేతుబద్ధంగా, ఫార్మా కంపెనీలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించేలా ఉండాలన్నారు. చాలా కాలంగా ఫార్మా కంపెనీలు ఔషధాలపై తక్కువ పన్ను, ముడి పదార్థాలపై ఎక్కువ పన్నుల సమస్యను ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తు చేశారు. దీనివల్ల ఉత్పత్తి వ్యయం పెరిగి, రోగులకూ ఔషధాలు అందుబాటు ధరల్లో లేకుండా పోతున్నాయన్నారు. త్వరలో చేపట్టే సంస్కరణలు ఈ కీలక సవాళ్లను అధిగమించేలా ఉంటాయని ఆశిస్తున్నట్టు తెలిపారు. పన్నుల హేతుబద్ధీకరణ ద్వారా ప్రతి పౌరుడికి అత్యవసర మందుల ధర అందుబాటులో ఉండే అవకాశం ఏర్పడుతుందన్నారు. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లోనూ మన కంపెనీల పోటీ సామర్థ్యం పెరిగి సరికొత్త ఔషధాలనూ ఉత్పత్తి చేయగలుగుతామని సతీష్ రెడ్డి పేర్కొన్నారు. పరిశ్రమకు మేలు చేసే సంస్కరణల కోసం ప్రభుత్వంతో కలిపి పని చేసేందుకూ సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ప్రస్తుతం తుది ఔషధాలపై 12 శాతం, వాటి తయారీ కోసం వినియోగించే ముడి పదార్థాలపై 18 శాతం జీఎస్టీ అమల్లో ఉంది. సంస్కరణల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న నాలుగు జీఎస్టీ శ్లాబులను ప్రభుత్వం 5, 18 పేరుతో రెండు శ్లాబులుగా మార్చాలని యోచిస్తోంది. డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ దేశీయ మార్కెట్లోకి జెనరిక్ మలబద్ధకాన్ని తగ్గించే ఔషధం లినాక్లోటైడ్‌ను తీసుకువచ్చింది. కొలోజో బ్రాండ్ పేరుతో దీన్ని విక్రయించనుంది. ఈ ఔషధం పెద్దలు, 6 నుంచి 17 ఏళ్ల వయసు కలిగిన వారిలో తలెత్తే మలబద్ధకాన్ని నివారిస్తుందని తెలిపింది.

## అమల్లోకి ట్రంప్ సుంకాలు.. భారత్‌లోని ప్రభావిత రంగాలు




ఇంటర్నెట్ డెస్క్: రష్యా నుంచి చమురు కొనుగోళ్లు బూచీగా చూపుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంపై విధించిన అదనపు 25 శాతం సుంకం నుంచి అమల్లోకి వచ్చింది. ఇది భారత్ పై అమెరికా విధించిన సుంకాల మొత్తాన్ని 50 శాతానికి తీసుకువచ్చింది. ఆగస్టు 7న భారత్ పై 25 శాతం పరస్పర సుంకాలను ట్రంప్ ప్రకటించారు. ఆ సుంకాలు భారత్ తోపాటు దాదాపు 70 ఇతర దేశాలపై కూడా అమలులోకి వచ్చాయి. %అయితే, రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోళ్లు చేస్తున్నందుకు గాను ఆగస్టు 7న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. భారత వస్తువులపై సుంకాలను 50 శాతానికి రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించారు. థింక్ ట్యాంక్ గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ ప్రకారం, భారతదేశం ప్రతి సంవత్సరం %ఖూ%కి దాదాపు 86.5 బిలియన్ డాలర్ల వస్తువులను ఎగుమతి చేస్తుంది. ఇందులో దాదాపు మూడింట రెండు వంతులు అంటే 60.2 బిలియన్ డాలర్ల వస్తువులు 50 శాతం సుంకాన్ని ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ అంచనాలు దీనికి కొంచెం తక్కువగా ఉన్నప్పటికీ, సుంకాలు %వి%48.2 బిలియన్ల విలువైన ఎగుమతులపై ప్రభావం చూపుతాయి. కొత్త సుంకాలు %ఖూ%కి షిప్‌మెంట్‌లను వాణిజ్యపరంగా లాభదాయకంగా చేయవు. వ్యాపార నష్టాలకు కారణమవ్వడమే కాకుండా ఆర్థిక వృద్ధి మందగించవచ్చని సమాచారం. టెక్స్‌టైల్స్, రత్నాలు, ఆభరణాలు, తోలు వస్తువులు, ఆహారం, ఆటోమొబైల్స్ వంటి వంటి రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయని %+ు=×% సూచిస్తోంది. ప్రభావిత రంగాలలో ఎగుమతులు 70 శాతం కుప్పకూలిపోవచ్చని, 60.2 బిలియన్ల నుంచి %వి%18.6 బిలియన్లకు తగ్గుతాయని థింక్ ట్యాంక్ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ హెచ్చరించారు. అంతేకాకుండా,కి మొత్తం షిప్‌మెంట్‌లు 43 శాతం తగ్గవచ్చు, భారతదేశ ఎగుమతి కేంద్రాలలో లక్షలాది ఉద్యోగాలను ప్రమాదంలో పడేస్తాయి. అధిక సుంకాల మధ్య భారతదేశ ఉత్పత్తులు పోటీతత్వాన్ని కోల్పోవచ్చు. ఇది చైనా, వియత్నాం వంటి దేశాలకు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది. ఎందుకంటే భారతదేశంపై విధించిన సుంకాలు చైనా (30 శాతం), వియత్నాం (20 శాతం), ఇండోనేషియా (19 శాతం), జపాన్ (15 శాతం) వంటి ఇతర ఆసియా దేశాల కంటే కూడా ఎక్కువగా ఉన్నాయి. రొయ్యలు: భారతదేశం 2025 ఆర్థిక సంవత్సరంలో 2.4 బిలియన్ల విలువైన రొయ్యలను ఎగుమతి చేసింది. ఇది మొత్తం రొయ్యల ఎగుమతుల్లో 32.4 శాతం వాటా కలిగి ఉంది. ముఖ్యంగా ఒలిచిన, డీవీన్ చేసిన, వండిన, బ్రెడ్ చేసిన రొయ్యలకు భారతదేశం అగ్ర మార్కెట్. ఈ రంగంలో మొత్తం సుంకాలు 60 శాతానికి పెరిగే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ-గేట్ ధరలు కుప్పకూలి విశాఖపట్నం, పశ్చిమ గోదావరిలోని ప్రాసెసింగ్ హబ్‌ల మనుగడకు ముప్పు వాటిల్లుతుంది. అయితే %+ు=×% ప్రకారం ఈక్వెడార్, వియత్నాం, ఇండోనేషియా, థాయిలాండ్ వంటి పోటీదారులు మార్కెట్ వాటాను స్వాధీనం చేసుకుంటారు.

## అమెరికా ఫెడ్ రిజర్వ్ గవర్నర్ లిసా కుక్‌కు ఉద్వాసన



న్యూయార్క్: తనఖా రుణాల అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై అమెరికా ఫెడరల్ రిజర్వ్ గవర్నర్ లిసా కుక్‌కు ఉద్వాసన చెప్పాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం నిర్ణయించారు. ఫెడ్‌కు గవర్నర్‌గా నియమితురాలైన తొలి ఆఫ్రికన్-అమెరికన్ ఆమె. ట్రంప్ నియమించిన ఫెడరల్ హౌసింగ్ ఫైనాన్స్ ఏజెన్సీ చీఫ్ విలియం పుల్టే.. లిసా తనఖా పెట్టిన రెండు నివాసాలు ఆమెకు సంబంధిచినవేనని ఆరోపించారు. దీన్ని ఆధారం చేసుకుని లిసాను రాజీనామా చేయాలని ఈ నెల 20న ట్రంప్ ఆదేశించారు. అంతేకాకుండా "మిమ్మల్ని పదవి నుంచి తొలగించేందుకు తగిన ఆధారాలున్నట్టు నేను నిర్ధారించుకున్నాను" అని ట్రంప్ ఆమెకు రాసిన లేఖలో పేర్కొన్నారు. తనఖా దరఖాస్తుల్లో ఆమె తప్పుడు సమాచారం ఇచ్చారని కూడా ఆరోపించారు. ఫెడ్ నాయకత్వంలో మార్పు లు చేయాలన్న తన ప్రయత్నంలో భాగంగా ట్రంప్ అనుసరిస్తున్న ఒత్తిడి వ్యూహమని విశ్లేషకులంటున్నారు. వడ్డీరేట్ల తగ్గింపు విషయంలో ఫెడ్‌కు, ట్రంప్‌కు మధ్యన విభేదాలున్న విషయం విదితమే.

## ట్రంప్ సుంకాల ఎఫెక్ట్.. 600 పాయింట్స్ నష్టపోయిన సెన్సెక్స్

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా సుంకాల ఎఫెక్ట్ దెబ్బకు గురువారం స్టాక్ మార్కెట్స్ నష్టాలతో ప్రారంభమయ్యాయి. నిఫ్టీ 180 పాయింట్ల మేర నష్టపోయి 24,583 వద్ద కొనసాగుతుండగా బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 600 పాయింట్ల నష్టపోయి 80,315 వద్ద ట్రేడవుతోంది. భారత్‌కు ఆర్థికంగా కీలకమైన 16 రంగాల్లో 14 రంగాల షేర్స్ నష్టాలను మూటగట్టుకున్నాయి. స్మాల్ క్యాప్, మిడ్ క్యాప్ షేర్లు కూడా వరుసగా 0.2 శాతం, 0.1 శాతం మేర నష్టాలను చవి చూశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ. 87.50 వద్ద కదలాడుతోంది. మంగళవారం నాడు కూడా నిఫ్టీ, సెన్సెక్స్ నష్టాలను చవి చూశాయి. ఒక్క రోజులో ఏకంగా 1 శాతం మేర నష్టపోయాయి. ఒక్క రోజులో ఈ స్థాయి నష్టం గత మూడు నెలల్లో ఇదే తొలిసారి. ఇక గురువారం మార్కెట్స్ ప్రారంభంలోనే నష్టాలను చవిచూశాయిట్రంప్ సుంకాల ఎఫెక్ట్ స్టాక్ మార్కెట్‌పై అధికంగా ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా ట్రేడింగ్ మొదట్లోనే అమ్మకాలు జోరందుకున్నాయి. విదేశీ పెట్టుబడులు తరలిపోవడం, లాభల్లో కోత వంటి వాటి ప్రభావం పెరిగింది. సుంకాల విషయంలో అంతిమంగా ఇరు దేశాలు మధ్యే మార్గం అనుసరించే అవకాశాలు ఉన్నా అప్పటివరకూ మార్కెట్‌లో స్వల్ప కాలిక ఒడిదుడుకులు తథ్యమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

## వచ్చే ఐదేళ్లలో భారత్‌లో రూ 70000 కోట్ల పెట్టుబడులు

హన్సల్‌పూర్ (గుజరాత్): భారత్‌లో సంస్థ కార్యకలాపాలు పటిష్ఠం చేయడంపై జపాన్‌కు చెందిన సుజుకీ మోటార్ కార్పొరేషన్ దృష్టి సారించింది. వచ్చే ఐదారేళ్ల కాలంలో ఇందుకోసం రూ.70,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు ప్రకటించింది. కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ కారు ఈ-విటారా ఎగుమతులను, లిథియం అయాన్ బ్యాటరీ సెల్స్ తయారీ విభాగాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో సుజుకీ మోటార్ ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ మాట్లాడుతూ.. తమ పెట్టుబడి ప్రణాళికలను వివరించారు. గత నాలుగు దశాబ్దాలుగా భారత మొబిలిటీ యానంలో సుజుకీ చురుకైన భాగస్వామిగా ఉన్నదని, పర్యావరణహితమైన హరిత మొబిలిటీని ప్రోత్సహించాలన్న భారత్ విజన్‌కు మద్దతుగా నిలుస్తుందని అన్నారు. ఏడాదికి 40 లక్షల యూనిట్ల తయారీ సామర్థ్యం సాధించడం, అందుకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి, ఆర్ అండ్ డీ ఏర్పాటు, కొత్త టెక్నాలజీలపై ఈ పెట్టుబడులుంటాయని మారుతి సుజుకీ ఇండియా చైర్మన్ ఆర్‌సీ భార్గవ చెప్పారు. రూ.35,000 కోట్లతో ఏర్పాటు చేస్తున్నట్టు గత ఏడాది ప్రకటించిన రెండో ప్లాంట్ నిర్మాణం గురించిన ప్రశ్నకు స్పందిస్తూ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం అనంతరం దానికి తాను సమాధానం చెప్పగలుగుతానన్నారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006